ఏపీ ప్రభుత్వం గూగుల్‌తో చారిత్రక ఒప్పందం కుదుర్చుకుని విశాఖను టెక్నాలజీ కేంద్రంగా మార్చేందుకు బాటలు వేసింది. సీఎం చంద్రబాబు, లోకేష్ దూరదృష్టితో 1.88 లక్షల ఉద్యోగాలు, గ్లోబల్ గుర్తింపు రాష్ట్రానికి రానున్నాయి. ఇది అభివృద్ధి నూతన యుగానికి శ్రీకారం.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 16.10.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 180 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




ఏపీ ప్రభుత్వం గూగుల్‌తో చారిత్రక ఒప్పందం కుదుర్చుకుని విశాఖను టెక్నాలజీ కేంద్రంగా మార్చేందుకు బాటలు వేసింది. సీఎం చంద్రబాబు, లోకేష్ దూరదృష్టితో 1.88 లక్షల ఉద్యోగాలు, గ్లోబల్ గుర్తింపు రాష్ట్రానికి రానున్నాయి. ఇది అభివృద్ధి నూతన యుగానికి శ్రీకారం.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 16.10.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 180 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00





## నవంబరు నుంచి క్షేత్రస్థాయిలో తనిఖీలు

- ప్రజలు మెచ్చేలా సుపరిపాలన అందిస్తున్నాం
- పాలనలో సుస్థిర విధానాలను అమలు చేస్తాం
- ఆర్టీజీఎస్, ప్రభుత్వ సేవల్లో సంతృప్త స్థాయిపై సమీక్షలో సీఎం చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలు, కార్యక్రమాల అమలు తీరు తెలుసుకునేందుకు నవంబరు నెల నుంచి క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రతీ పౌరుడికీ సంక్షేమ ఫలాలు ఎలా అందుతున్నాయో అనే అంశాన్ని తనిఖీ చేస్తానని సీఎం అన్నారు. బుధవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో ప్రభుత్వ సేవల్లో సంతృప్త స్థాయి సహా రియల్ టైమ్ గవర్నెన్స్ పనితీరుపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజలు మెచ్చేలా సుపరిపాలన అందిస్తున్నామని.. పాలనలో సుస్థిర విధానాలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గతనెల 22వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా జీఎస్టీ 2.0 సంస్కరణలతో ప్రజలకు కలిగిన ప్రయోజనాలు, లబ్ధి తదితర అంశాలపై ప్రజల నుంచి సేకరించిన ఫీడ్ బ్యాక్ వివరాలను సీఎం పరిశీలించారు. నిత్యావసరాలు, ఇతర ఉత్పత్తులపై పన్నులు తగ్గిన అంశంపై గిరిజన ప్రాంతాల్లో మరింత అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. దీపావళి పండుగ తర్వాత కూడా సూపర్ జీఎస్టీ ద్వారా పన్నుల తగ్గింపు, తద్వారా ధరలు తగ్గిన అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పేర్కొన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల కలిగే లబ్ధిని స్లైడ్స్ ద్వారా సినిమా థియేటర్లలో ప్రదర్శించాలని సీఎం సూచించారు.

**వన్ గవర్నమెంట్ - వన్ సిటిజన్ విధానంతో ప్రభుత్వ సేవలు :** వివిధ శాఖలు అందించే ప్రభుత్వ సేవలపై టెక్నాలజీ డేటా ఆడిటింగ్ ద్వారా సంతృప్త స్థాయిని అంచనా వేస్తామని సీఎం స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలకు అధికారులు ఇచ్చే సమాచారానికి పొంతన ఉండాలని సీఎం అన్నారు. సామాన్యుడికి మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. వన్ గవర్నమెంట్ వన్ సిటిజన్ అన్న విధానంతో సమర్ధవంతంగా ప్రజలకు సేవలందిస్తామని అన్నారు. దీనిపై నవంబరు మొదటి వారంలో మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్ల పనితీరును మదింపు చేస్తామని సీఎం అన్నారు. మిగతా 3లో...

### విశాఖలో గూగుల్ డేటా సెంటర్

## దేశానికే తలమానికం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** కూటమి పాలనలో భారీ పెట్టుబడులు, దిగ్గజ ఐటీ కంపెనీలు విశాఖ నగరానికి క్యూ కడుతున్నాయని విశాఖ జిల్లా ఇన్ చార్జ్ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం నాడు విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ......విశాఖలో గూగుల్ డేటా సెంటర్ దేశానికే తలమానికం. ఈ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుతో విద్య, వైద్యం వ్యవసాయం సహా అనేక రంగాల్లో కీలక మార్పులు వస్తాయి. సీఎం చంద్రబాబు,మంత్రి లోకేశ్ కృషి, శ్రమతో విశాఖ నగరం డేటా సెంటర్ హబ్ గా ఎదుగుతోంది. 16 నెలల్లోనే విశాఖకు రూ. 6.50 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఒప్పందాలు, భూ కేటాయింపులు పూర్తయిన సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయి. రూ. 1.35 లక్షల కోట్లతో ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ, క్యాప్టివ్ పోర్టులను అభివృద్ధి చేయనుంది. ఎన్టీపీసీ రూ. 1.80 లక్షల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటు చేయనుంది. రాంబిల్లిలో న్యూక్లియర్ సబ్ మెరైన్ బేస్, భోగాపురం విమానాశ్రయం, మూలపేట పోర్టు, జీఎంఆర్ యూనివర్సిటీ, ఫార్మా పార్కు, స్టార్ హోటల్స్, మాస్టర్న్ రోడ్లు, ఫ్లైఓవర్లు, కోస్టల్ కారిడార్, రైల్వే జోన్, మెట్రో.. ఇలా వైవిధ్యమైన ప్రాజెక్టులతో విశాఖ ప్రగతి బహుముఖా లుగా విస్తరిస్తోంది. వైసీపీ హయాంలో ఐటీ కంపెనీలకు ఇవ్వాల్సిన రాయితీలు, ప్రోత్సాహాలు ఎగ్గొట్టారు. ఐబీఎం, హెచ్.ఎస్ బీసీ ఉంటే పెద్ద కంపెనీలను విశాఖ నుంచి జగన్ తరిమేశారు.ఐదేళ్లలో విశాఖ కేంద్రంగా యువతకు భారీగా ఐటి ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా మంత్రి లోకేష్ శ్రమిస్తున్నారని మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు.

## అన్ని రంగాల్లో ఏపీ నెం.1 ఉండాలి

- మంగళగిరిలో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేస్తున్నాం
- గూగుల్ తో పాటు డీలర్ షిప్ లు కూడా ముఖ్యమే
- మంగళగిరిలో లక్ష్మీ గ్రూప్ ఆధ్వర్యంలో టాటా హిటాచీ డీలర్ షిప్ షోరూం, మెషిన్ కేర్ ఫెసిలిటీని ప్రారంభించిన మంత్రి నారా లోకేష్




**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** అన్ని రంగాల్లో ఏపీ నెం.గా ఉండాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, దేశంలోనే మంగళగిరిని అభివృద్ధి పథాన నిలుపుతామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి బైపాస్ ఆత్మకూరులో లక్ష్మీ గ్రూప్ ఆధ్వర్యంలో శ్రీ ధనలక్ష్మి ఆటో ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ నూతనంగా ఏర్పాటుచేసిన టాటా హిటాచీ డీలర్ షిప్ షోరూం, మెషిన్ కేర్ ఫెసిలిటీని రిబ్బన్ కట్ చేసి మంత్రి నారా లోకేష్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. 'ఇక్కడకు వస్తుంటే రోడ్డుపైన ఒక ఎక్స్ కవేటర్ పెట్టారు. అది చూసినప్పుడు నాకు 2019-24 మధ్య రోజులు గుర్తుకువచ్చాయి. గత ప్రభుత్వంలో శుక్ర, శనివారాలు వస్తే ఈ బుల్డోజర్ ను ఎవరో ఒకరి ఇంటికి పంపేవారు. ఎవరో ఒకరిని ఇబ్బంది పెట్టాలని గత ప్రభుత్వం ప్రయత్నించింది. ప్రజా ప్రభుత్వంలో మాత్రం ఎక్స కవేటర్స్ ను అభివృద్ధి కోసం, అమరావతి పనులు, రోడ్ల అభివృద్ధి చేసేందుకు ఉపయోగిస్తోంది. మంగళగిరి అమరావతికి ముఖద్వారం. అమరావతిలో పనులు చేసే వారు మంగళగిరిలోనే ఉండాలి. సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎకో సిస్టమ్ మంగళగిరిలోనే ఇప్పుడు సిద్ధంగా ఉంది. 2019 ఎన్నికల్లో 21 రోజుల ముందు మంగళగిరికి వచ్చా. మీ సమస్యలను నేను అర్థం చేసుకోలేకపోయా, నేనెంటో మీకు తెలియదు. 5300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఐదేళ్లపాటు మీకు అందుబాటులో ఉండి మీ సమస్యలు తెలుసుకున్నా. ప్రభుత్వం కంటే మెరుగైన సేవా కార్యక్రమాలను ఆనాడు నేను చేశాను' అని లోకేష్ అన్నారు. మిగతా 3లో...

### పంచాయతీ వ్యవస్థలో సంస్కరణలు...

## డిప్యూటీ సీఎంకి కృతజ్ఞతలు



**పునర్వ్యవస్థీకరణతో మెరుగైన సేవలు అందుతాయి**

**10వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టి నాలుగు గ్రేడులుగా పంచాయతీలను వర్గీకరించడం శుభ పరిణామమని ఏపీ పంచాయతీ సెక్రెటరీస్ అసోసియేషన్ తెలిపింది. ఈ రోజు సాయంత్రం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో అసోసియేషన్ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తో సమావేశమయ్యారు. పంచాయతీ పరిపాలన వ్యవస్థలో పునర్వ్యవస్థీకరణ చేపట్టినందుకు బుధవారం కృతజ్ఞతలు తెలియచేశారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "గ్రామాల్లో చక్కటి మౌలిక సదుపాయాలు కల్పించాలి. నాలుగు గ్రేడుల పంచాయతీల విధానం కచ్చితంగా గ్రామీణ ప్రజలకు మేలు చేస్తుంది. రూర్బన్ పంచాయతీలు గుర్తించినవాటిలో పట్టణ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. మిగతా 3లో...

## రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ

- త్వరలో రాజధానిలో ఒకేసారి 12 బ్యాంకులకు శంకుస్థాపన
- గూగుల్ డేటా సెంటర్‌తో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన ఏపీ
- ఉద్యోగ, ఉపాధి కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- పీఎం మోడీ, సీఎం చంద్రబాబులతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
- వికేంద్రీకరణ విధానంలో అభివృద్ధికి ఏపీ ఓ నిర్వచనం
- డబులింజన్ సర్కార్ వల్ల ప్రయోజనాలేంటో ప్రజలు తెలుసుకుంటున్నారు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** డబులింజన్ సర్కారు కృషి ఫలితంగా రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ల సమిష్టి కృషి వల్లే రాష్ట్రంలో పెద్ద పెద్ద సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయని మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో అతి పెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి గూగుల్ సంస్థ ముందుకొచ్చి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడం హర్షణీయమన్నారు. దీనివల్ల విశాఖపట్నం రూపురేఖలు మారిపోవడమే కాకుండా, ప్రపంచదేశాల దృష్టిని ఆంధ్రప్రదేశ్ ఆకర్షించగలిగిందన్నారు. విశాఖలో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్)కు సంబంధించి అనేక పరిశ్రమలు రాబోతున్నాయన్నారు. గూగుల్ సంస్థ విశాఖలో భారీ పెట్టుబడులు పెట్టడం వెనుక ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ల అలుపెరుగని కృషి దాగిఉందన్నారు. డబులింజన్ సర్కారు కృషితో విశాఖపట్నాన్ని ఫార్మా రాజధానిగా మార్చేలా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రధాని మోడీ రేపు(గురువారం) కర్నూలు పర్యటన సందర్భంగా రూ. 13, 000 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని తెలిపారు. సి ఆర్ డి ఏ పరిధిలో 12 వివిధ బ్యాంకుల కార్యాలయాల నిర్మాణానికి సంబందించిన కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేస్తారని మంత్రి తెలిపారు.

**వికేంద్రీకరణకనుగుణంగా అన్ని ప్రాంతాల అభివృద్ధి:** ఏపీని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి కేంద్రం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తోందన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాంతం కూడా అభివృద్ధిలో మిగతా 3లో...



### విశ్వనగరంగా ఎదిగేందుకు...

## మరో అడుగు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** గూగుల్ సెంటర్ ఏర్పాటుతో విశాఖపట్నం విశ్వనగరంగా ఎదిగేందుకు మరో అడుగు ముందుకు పడిందని రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ల కృషి వల్లే ఇది సాధ్యమైందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా లోకేష్ 12 నెలల కృషి నేడు గూగుల్ పెట్టుబడులని సాదించాం. వికసిత్ భారత్ లక్ష్యానికి ఈ కొత్త సాంకేతికత ఉపయోగపడుతుందన్న ఆశా భావాన్ని సుభాష్ వ్యక్తం చేశారు. గూగుల్ సంస్థ విశాఖలో హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు తో విశాఖపట్నం గేమ్ చేంజర్ గా మారబోతోం దని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు అంటే ఐటీ.. ఐటీ అంటే విశాఖనగరం రూపుదిద్దుకోబోతోందని ఆయన తెలియజేశారు. ఏఐ టెక్నాలజీని సైతం విశాఖకు నిలయంగా మలిచే ప్రయత్నంచేస్తున్నముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ బలమైన పునాదులు వేస్తున్నారని మంత్రి సుభాష్ కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల పాలనలో ఏకంగా దాదాపు 11లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని, ఒక్కగూగుల్ సంస్థే లక్ష33 వేల కోట్ల రూపాయలను పెట్టుబడి పెడుతోందంటే అది బాబు గ్యారెంటీకి దిక్సూచిగా నిలుస్తుందని వాసంశెట్టి సుభాష్ తెలిపారు.

ఇప్పటికే అభివృద్ధి పథంలో సాగుతున్నవిశాఖ రూపురేఖలు ఈ డేటా సెంటర్ తో పూర్తిగా మారిపోతాయన్న ఆకాంక్షను సుభాష్ వ్యక్తం చేశారు. అటు ఉత్తరాంధ్ర వారికే కాకుండా కోస్తా జిల్లాలోని ఐటి నిపుణులకు ఈ సెంటర్ ద్వారా ఉపాధిలభిస్తుందన్నారు. భారత డిజిటల్ ఎకానమీని సమూలంగా మార్చేందుకు ఈ కేంద్రం ప్రేరకం అవుతుందని మంత్రి తెలియజేశారు. చంద్రబాబు చొరవ, లోకేష్ శ్రద్దాశక్తులకు మంత్రి సుభాష్ అభినందనలు తెలియ జేశారు.

## పొదుపు పండుగ వేడుకలకు ప్రధాని రాక



**సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ వేడుకల్లో పాల్గొననున్న ప్రధాని మోదీ**

**భారీ బహిరంగ సభకు బ్రహ్మాండమైన ఏర్పాట్లు**

**రూ. 13,429 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న ప్రధాని**

**శ్రీశైల దివ్యక్షేత్రంలో మహాదేవుణ్ణి దర్శించుకోనున్న ప్రధాని మోదీ**

**ప్రధాని పర్యటన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నిరంతర పర్యవేక్షణ**

**వారం రోజుల నుంచి కర్నూలులో మకాం వేసిన మంత్రులు**

**కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గురువారం ప్రధాని పర్యటన**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ధరల భారాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేపడుతోంది. జీఎస్టీ సంస్కరణల నిర్ణయాన్ని స్వాగతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రచార కార్యక్రమాన్ని పండుగలా జరుపుతోంది. దసరా నుంచి దీపావళి వరకు సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పేరుతో ఈ ప్రచారాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్ర ప్రజలపై సుమారు రూ. 8 వేల కోట్ల మేర భారం తగ్గుతుందని ఓ అంచనా. ఈ క్రమంలో ప్రధాని తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేపడుతోంది. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు గురువారం ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి రానున్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు చెక్ పోస్టు సమీపంలో జరిగే బహిరంగ సభలో ప్రధాని పాల్గొననున్నారు. అలాగే సభకు వచ్చే ముందు శ్రీశైలం దివ్యక్షేత్రానికి వెళ్లి జ్యోతిర్లింగ మూర్తి శివుణ్ణి, శక్తిపీఠంలో కొలువైన భ్రమరాంబిక దేవిని ప్రధాని మోదీ దర్శించుకుంటారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రధాని పర్యటన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. భారీ బహిరంగ సభను నిర్వహించనుంది. 2024 ఎన్నికల తర్వాత అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కూటమి నేతృత్వంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడిన తర్వాత ఏపీలో ప్రధాని విశాఖ, మిగతా 3లో...

## నవంబరు నుంచి క్షేత్రస్థాయిలో తనిఖీలు



(మొదటి పేజీ తరువాయి)

ఇన్సిడెంట్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా వేర్వేరు ఘటనల్ని సమన్వయంతో పర్యవేక్షించటంతో పాటు త్వరితగతిన బాధితులకు స్వాంతన కలిగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఈ అంశాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ చలానాల పేరిట వాహనదారులను ఇబ్బందులు పెట్టవద్దని సీఎం సూచించారు.

**సాంకేతికతతోనే రాజకీయ కుట్రలు బట్టబయలు:** రాష్ట్రంలోని కొన్ని అంశాలను రాజకీయంగా ఉపయోగించుకుని నేరాలు చేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని.. ఈ తరహా వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలలు నిర్మిస్తుంటే ..ప్రైవేటు పరం చేస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు. పీపీపీ ద్వారా వచ్చే మెడికల్ కాలేజీల్లో పేద విద్యార్థులకు అదనంగా మరిన్ని సీట్లు అందుబాటులోకి రావటంతో పాటు పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యం కూడా లభిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెంచేందుకు కూడా కొందరు కుట్రలు చేశారని.. సకాలంలో సాంకేతికత వినియోగించి వారి బండారం బయట పెట్టామన్నారు. ఇప్పుడు నకిలీ మద్యం తయారు చేసి తిరిగి ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమీక్షకు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఐటీ, ఆర్టీజీఎస్, ఎక్సైజ్, భూగర్భ జల వనరుల శాఖ అధికారులు హాజరయ్యారు.

## రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ



(మొదటి పేజీ తరువాయి)

వెనకడుగు వేయకుండా అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఒకేరాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ అన్నదే కూటమి ప్రభుత్వ నినాదమన్నారు. ఇందులో భాగంగానే ప్రతి జిల్లాలోనూ పరిశ్రమలు ఏర్పాటయ్యేలా ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే అనంతపురం, కర్నూలు జిల్లాలో సిమెంటు ఫ్యాక్టరీలు, పంప్డ్ స్టోరేజీ పరిశ్రమలు వస్తున్నాయన్నారు. చిత్తూరు, కడప జిల్లాలను ఎలక్ట్రానిక్స్ తయారీ హబ్ లు గా అభివృద్ధి చేస్తున్నామని, ఈ రంగానికి సంబంధించిన పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణాన్ని ఆ జిల్లాల్లో కల్పిస్తున్నామన్నారు. నెల్లూరు, తిరుపతి జిల్లాలోని శ్రీసిటీ గ్రేటర్ ఎకోసిస్టమ్ లో అనేక పెట్టుబడులు కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్నదని చెప్పారు. అమరావతి రాజధాని క్వాంటం టెక్నాలజీలో దేశంలోనే ప్రత్యేక గుర్తింపును పొందిందని పేర్కొన్నారు. ఇలా అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయడం ద్వారా అభివృద్ధి వికేంద్రీకరణకు నిర్వచనం అంటే ఏంటో కూటమి ప్రభుత్వం చేసి చూపిస్తోందని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

**పెట్టుబడుల సదస్సుకు హాజరుకావాలని ప్రధాని మోడీని ఆహ్వానించాం:** దేశంలో అన్నిరాష్ట్రాల కంటే ఏపీలో పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన వాతావరణం ఉందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెద్ద సంస్థలకు ఇక్కడి వాతావరణం గురించి తెలియజేసి, పెట్టుబడులు పెద్ద ఎత్తున ఆకర్షించేలా నవంబరు 14,15 తేదీల్లో విశాఖపట్నంలో భారీ ఎత్తున పెట్టుబడుల సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధాన మంత్రి మోదీని ప్రభుత్వం తరఫున ఆహ్వానించారని తెలిపారు. ఈ సదస్సు ద్వారా రికార్డు స్థాయిలో రాష్ట్రానికి పెట్టుబడులు రానున్నాయన్నారు.

## మైనారిటీ అభ్యున్నతి పాటుపడతాం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :**రాష్ట్రంలో మైనారిటీల అభ్యున్నతికి అన్ని విధాలా కృషి చేస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం డిప్యూటీ కలెక్టర్, మైనారిటీ జిల్లా ఆఫీసర్ పార్థసారథితో కలిసి ముస్లిం మైనారిటీ అభ్యున్నతికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూప్రధాన మంత్రి జనవికాస్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో మైనారిటీల కోసం అభ్రుద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. స్థానిక బ్లూ లైట్ సెంటర్ లో మల్టీపర్పస్ స్కిల్ సెంటర్, ఫంక్షన్ హాలు నిర్మించనున్నామని వెల్లడించారు. రెడ్ ట్యాంక్ వద్ద షాదీఖానా, ఉర్దూ ఇనిస్టిట్యూట్, లైబ్రరీలతో కలిపి బిల్డింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దీంతోపాటు మైనారిటీ బాల,బాలికల హాస్టల్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్నమని వెల్లడించారు. నందివెలుగు రోడ్డు ఏపీ రెసిడెన్షియల్ ఉర్దూ పాఠశాలలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంజుమన్ పాఠశాలలో స్కిల్ సెంటర్ తోపాటు ఇతర మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. ఆయా ప్రాంతాలను స్వయంగా పరిశీలించామని, వీటికి సంబంధించి ప్రణాళికలు రూపొందిస్తామని అన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మైనారిటీల అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో మౌజన్లు, ఇమామ్ లకు అందించాల్సిన గౌరవ వేతనం బకాయిలను తాము అధికారంలోకి వచ్చిన వెంటనే విడుదల చేశామని అన్నారు.

# పొదుపు పండుగ వేడుకలకు ప్రధాని రాక

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి ప్రాంతాల్లో పర్యటించారు. గురువారం రాయలసీమ ప్రాంతంలో ప్రధాని పర్యటన జరగనుంది.

**జీఎస్టీ సంస్కరణలపై భారీ ప్రచారం... సభకు భారీ ఏర్పాట్లు :** జీఎస్టీ 2.0 నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగ నుంచి భారీ ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార కార్యక్రమం చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఈ ప్రచారంలో భాగమైంది. మండల స్థాయి మొదలుకుని జిల్లా స్థాయి వరకు పెద్ద ఎత్తున జీఎస్టీ సంస్కరణలపై కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు రాష్ట్ర వ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించారు. అలాగే వివిధ విద్యా సంస్థల్లో కూడా జీఎస్టీ సంస్కరణలపై రకరకాల పోటీలు నిర్వహించారు. వినియోగదారులకు జీఎస్టీ సంస్కరణల వల్ల కలిగే లబ్దిని ఇంటింటికి తిరిగి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగమే కాకుండా... కూటమికి చెందిన మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు కూడా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. యోగా డే సందర్భంగా ప్రభుత్వం ఏ స్థాయిలో ప్రచారం చేపట్టిందో... ఇప్పుడు సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమాన్ని అంతే ప్రతిష్టాత్మకంగా తీసుకుంది రాష్ట్ర ప్రభుత్వం. మండలాల వారీగా, జిల్లాల వారీగా జరుగుతున్న కార్యక్రమాల పర్యవేక్షణకు.. మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా ఓ డ్యాష్ బోర్డు ఏర్పాటు చేసుకుని మరీ జీఎస్టీ సంస్కరణలపై ప్రచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం, కూటమికి చెందిన మూడు పార్టీలు చేపట్టాయి. ప్రస్తుతానికి 90 వేలకు పైగా ఈవెంట్లను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం సూపర్ సక్సెస్ అయిన క్రమంలో కర్నూలులో ప్రధాని హాజరు కానున్న భారీ బహిరంగ సభను అంతే సక్సెస్ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసింది. వివిధ శాఖల సమన్వయంతో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా.. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది రాష్ట్ర ప్రభుత్వం. గత 15 రోజుల నుంచి వివిధ శాఖలకు చెందిన



ఉన్నతాధికారులు నిరంతరం కర్నూలు సభను మానిటర్ చేస్తున్నారు. సభకు వచ్చే వారికి భోజన సౌకర్యం మొదులుకుని... పార్కింగ్, సభలో సీటింగ్ ఏర్పాట్లు, మంచినీటి సరఫరా, తిరిగి వెళ్లేటప్పుడు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా... అసౌకర్యం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది. ఇక ఉమ్మడి కర్నూలు జిల్లాల నుంచి భారీ ఎత్తున ప్రజలు ఈ సభకు వస్తారని అంచనా. లక్షలాది సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున దానికి తగ్గ ఏర్పాట్లు, బందోబస్తు చేపట్టారు. సభకు వచ్చే వారికి ప్రయాణ సౌకర్యం కల్పించారు. అలాగే భారీ బందోబస్తు చేశారు. సుమారు 1800 మంది బలగాలతో ప్రధాని సభకు బందోబస్తు పెడుతున్నారు. ఇక ట్రాఫిక్ జాంలు కాకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్లు పెట్టారు.

**ముఖ్యమంత్రి మానిటరింగ్... మంత్రుల మకాం:** ఇక ప్రధాని పర్యటనను సూపర్ సక్సెస్ చేసేందుకు సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూనే ఉన్నారు. అలాగే జీఎస్టీ సంస్కరణలపై క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ప్రచారానికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉన్నారు. సభకు సంబంధించిన ఏర్పాట్లతో పాటు శ్రీశైల క్షేత్రాన్ని ప్రధాని సందర్శిస్తుండటంతో ఆ దేవాలయంలో ఏర్పాట్లను.. ప్రధాని దృష్టికి తీసుకురావాల్సిన అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ఎప్పటికప్పుడు చర్చిస్తూనే ఉన్నారు. ఇక కర్నూలు జిల్లాలో మంత్రులు దాదాపు వారం రోజుల నుంచి మకాం వేశారు. సభ ఏర్పాట్లపై దగ్గరుండి పర్యవేక్షించారు. శాఖల వారీగా బాధ్యతలు పంచుకుంటూ.. సమిష్టిగా సభకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించుకుంటూ వారం రోజుల నుంచి కర్నూలులోనే ఉన్నారు మంత్రులు.

**రూ. 13,429 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్న ప్రధాని:** కర్నూలు, నంద్యాల జిల్లాలో ప్రధాని పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ భారీ ఎత్తున ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలను చేపట్టనున్నారు. మొత్తంగా రూ. 13,429 కోట్ల మేర అభివృద్ధి పనులకు మోదీ శ్రీకారం చుట్టనున్నారు. వీటిల్లో కొన్ని శంకుస్థాపనలు, కొన్ని ప్రారంభోత్సవాలు ఉండగా.. ఓ రెండు ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తున్నారు ప్రధాని. రూ. 9449 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు చేస్తుండగా... రూ. 1704 కోట్ల విలువైన ప్రాజెక్టులను మోదీ ప్రారంభించనున్నారు. ఇక రూ. 2276 కోట్ల విలువైన ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తున్నారు.

**అభివృద్ధి కార్యక్రమాల వివరాలివి:** విద్యుత్ ట్రాన్సమిషన్ వ్యవస్థకు – శంకుస్థాపన – రూ. 2886 కోట్లు

ఓర్వకల్లు–కొప్పర్తి పారిశ్రామిక కారిడార్ – శంకుస్థాపన – రూ. 4922 కోట్లు

కొత్త వలస – విజయనగరం మధ్య 4వ లైన్ – శంకుస్థాపన – రూ. 493 కోట్లు

పెందుర్తి – సింహాచలం నార్త్ మధ్య రైల్ ఫ్లైఓవర్ లైన్ – శంకుస్థాపన – రూ. 184 కోట్లు

సబ్బవరం–షీలానగర్ జాతీయ రహదారి –శంకుస్థాపన – రూ. 964 కోట్లు

రేణిగుంట – కడప – మదనపల్లె రోడ్డు ప్రారంభం – రూ. 82 కోట్లు

కడప – నెల్లూరు – చునియంపల్లి రోడ్లు ప్రారంభం – రూ. 286 కోట్లు

కనిగిరి బైపాస్ రోడ్ ప్రారంభం – రూ. 70 కోట్లు

గుడివాడ–నూజెండ్ల వద్ద 4–లేన్ల రోడ్డు ఓవర్ బ్రిడ్జి ప్రారంభం – రూ. 98 కోట్లు

కల్యాణదుర్గం – రాయదుర్గం – మొలకలమూరు రోడ్డు ప్రారంభం – రూ. 13 కోట్లు

పీలేరు నుండి కలసూర్ సెక్షన్ వరకు నాలుగు లేన్ల రోడ్ ప్రారంభం – రూ. 593 కోట్లు

నిమ్మకూరులోని BELలో అడ్వాన్స్డ్ నైట్ విజన్ ప్రారంభం – రూ. 362 కోట్లు

చిత్తూరులోని ఇండేన్ బాట్లింగ్ ప్లాంట్ ప్రారంభం – రూ. 200 కోట్లు

కొత్తవలస –కొరాపుట్ రైల్వే డబ్లింగ్ పనులను జాతికి అంకితం – రూ. 546 కోట్లు

శ్రీకాకుళం– అంగుల్ నాచురల్ గ్యాస్ పైప్‌లైన్ జాతికి అంకితం – రూ. 1730 కోట్లు

**ప్రధాని పర్యటన ఇలా..:** ఢిల్లీ నుంచి నేరుగా కర్నూలు ఎయిర్ పోర్టుకు ప్రధాని చేరుకుని అక్కడి నుంచి శ్రీశైల దేవస్థానానికి చేరుకుంటారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు ప్రధాని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శిస్తారు. అనంతరం ప్రధానమంత్రి మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో కర్నూలు సభకు చేరుకుని సభలో పాల్గొంటారు. అనంతరం ప్రధాని హెలీకాప్టర్ ద్వారా కర్నూలు ఎయిర్ పోర్టుకు చేరుకుని.. ఢిల్లీకి తిరుగుపయనం అవుతారు.

# అన్ని రంగాల్లో ఏపీ నెం.1 ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

**మంగళగిరిలో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేస్తున్నాం:** '2024 ఎన్నికల్లో మంగళగిరిలో పోటీ చేయవద్దని నన్ను చాలా మంది కోరారు. అయినా ఇక్కడి నుంచే పోటీచేసి గెలుస్తానని చెప్పా. 53వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఆనాడు కోరా. ఏకంగా నన్ను 91వేల ఓట్ల మెజార్టీతో గెలిపించి నన్ను శాసనసభకు పంపించారు. ఈ రోజు సీఎం గారు, డిప్యూటీ సీఎం గారు, సహచర మంత్రులను కలిసి మంగళగిరి పని అంటే కాదు అని చెప్పేవారే లేరు. ఇంటి పట్టాలు, వంద పడకల ఆసుపత్రి, స్మశానాల అభివృద్ధి, కమ్యూనిటీ భవనాలు, భూగర్భ డ్రైనేజీ, తాగునీరు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. మంగళగిరిలో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేస్తున్నాం. ఇది బుల్డోజర్ ను మంచి కార్యక్రమాలకు వినియోగిస్తున్నాం. జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్ ను మంగళగిరిలో ఏర్పాటుచేస్తాం. ఎంత పని ఒత్తిడి ఉన్నా ముందు మంగళగిరికే ప్రాధాన్యత ఇస్తాను. గూగుల్ ఎంత ముఖ్యమో డీలర్ షిప్ కూడా నాకు అంతే ముఖ్యం' అని లోకేష్ చెప్పారు.





**గూగుల్ తో పాటు డీలర్ షిప్ లు కూడా ముఖ్యమే:** 'డీలర్ షిప్ వల్ల ఎంతోమందికి ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ప్రతి ఉద్యోగం ఎంతో ముఖ్యం. గూగుల్ లాంటి సంస్థ వస్తే సరిపోదు. వారు భవన నిర్మాణాలు చేయాలంటే ఎకో సిస్టమ్ కావాలి. ఇదే ఎక్స్ కవేటర్, బుల్డోజర్ కూడా అవసరం. దానికి సర్వీస్ సెంటర్ కావాలి. చంద్రబాబు గారిని చూసే నేను ఇది నేర్చుకున్నా. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. డీలర్ షిప్ ల వల్ల కూడా ఉద్యోగాల కల్పన జరుగుతుంది. మొత్తం ఎకో సిస్టమ్ వస్తే మేం ఇవన్నీ సాధించగలగుతాం. ఇతర డీలర్ షిప్ లను కూడా మంగళగిరి ఏర్పాటుచేస్తే మా యువతకు ఉద్యోగాలు వస్తాయని కంభంపాటి గారిని కోరుతున్నా. లక్ష్మీ గ్రూప్ ను చూస్తూ పెరిగాను. ఎంతో నిబద్ధత గల సంస్థ. టీడీపీ ఎంతోమంది ఎదుగుదలకు తోడ్పడింది. కంభంపాటి గారు దాదాపు 6వేల మందికి ఉద్యోగాలు కల్పించారు. సంస్థ మరింత వృద్ధిలోకి రావాలని కోరుకుంటున్నాను' అని లోకేష్ అన్నారు.

**దేశంలోనే మంగళగిరిని నెం.1గా అభివృద్ధి చేస్తాం:** 'మంగళగిరి ప్రజలకు అందుబాటులో ఉంటా. దేశంలోనే మంగళగిరి నియోజకవర్గాన్ని నెం.1 అభివృద్ధి చేస్తాం. వచ్చే నెలలో భూగర్భ డ్రైనేజీ పనులు కూడా ప్రారంభిస్తాం. టాటా హిటాచీ ఎండీ సందీప్ సింగ్ మద్దతు ఏపీకి ఉండాలని కోరుకుంటున్నాను. కంపెనీలు ఏపీకి రావడం వెనుక అనేక మంది కృషి ఉంది. అన్నిరంగాల్లో ఏపీ నెం.1 ఉండాలనేదే మా లక్ష్యం' అని లోకేష్ అన్నారు. అనంతరం ఎక్స్ కవేటర్లను కొనుగోలు చేసిన పలువురు కష్టమర్లకు మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ గ్రూప్ ఫౌండర్ అండ్ ఛైర్మన్ కంభంపాటి రామ్మోహన్ రావు, టాటా హిటాచీ ఎండీ సందీప్ సింగ్, లక్ష్మీగ్రూప్ ఎండీ కె.జయరాం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.భరత్ భూషణ్, ఆపరేషనల్ డైరెక్టర్ కె.వెంకట శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రౌడీయిజం, గంజాయి నిర్మూలనకు కఠిన చర్యలు

**తెనాలి (జర్నలిస్టు ఫైల్)**

తెనాలి పట్టణంలో రౌడీయిజం, గంజాయి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని గుర్తించి, వాటిపై సమగ్ర ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ రోజు తెనాలి పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని తెనాలి 1వ, 2వ టౌన్, తెనలి రూరల్ పోలీస్ స్టేషన్లను సందర్శించి, గంజాయి నిర్మూలన, మహిళల భద్రత, రౌడీషీటర్ల నియంత్రణ, సైబర్ నేరాల నివారణ వంటి అంశాలను సమీక్షించారు.

తెనాలిలో రౌడీయిజం అధికంగా ఉందని గుర్తించినట్లు ఎస్పీ వెల్లడించారు. తరచుగా నేరాలకు పాల్పడుతున్న రౌడీషీటర్లపై పీడీ యాక్టు, ఎన్.డీ.పీ.ఎస్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. రౌడీయిజం, గంజాయి వాడకాన్ని నిర్మూలించేందుకు కఠిన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.



మహిళల భద్రతకు శక్తి బృందాలను ఏర్పాటు చేశారని, డ్రోన్ కెమెరాలతో స్కూళ్లు, కాలేజీల వద్ద నిత్యం నిఘా కొనసాగుతున్నట్లు చెప్పారు. ఫిర్యాదు అందిన వెంటనే నిందితులను అరెస్ట్ చేసి, 60 రోజుల్లోపే ఛార్జ్‌షీట్ దాఖలు చేయించి ట్రయల్ పూర్తిచేయాలన్న విధానం అమలులో ఉందన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. తెనాలి పట్టణం ప్రజలు భయంలేకుండా స్వేచ్ఛగా తిరగగలిగే భద్రతా వాతావరణం కల్పించడమే లక్ష్యమని చెప్పారు.

కొల్లిపరలో ఇటీవల 13 కేసులను పోలీసులు విచారించి నిందితుడిని గుర్తించినట్లు తెలిపారు. రాత్రివేళ రోడ్లపై అనవసరంగా తిరుగుతూ గొడవలకు దారితీసే వారిపై ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించారని, రాత్రి 11 గంటల తర్వాత రోడ్లపై తిరిగేవారిని స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ చేసి, కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాల పెరుగుదలపై ప్రజల్లో అవగాహన పెంచుతున్నామని, బ్యాంక్ వివరాలు లేదా ఓటీపీలను ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేయాలని లేదా cyber-crime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

తెనాలిలో ఉన్న పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థలో ఉండటంతో ప్రభుత్వానికి సమాచారం అందజేసినట్లు తెలిపారు. తెనాలి సబ్‌డివిజన్ పర్యటనలో డీఎస్పీ జనార్దన్ రావు, సీఐలు మల్లిఖార్జున రావు, రాములు నాయక్, రూరల్ ఎస్సై ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# తురకపాలెం బాధిత కుటుంబాల పరామర్శ

గుంటూరు రూరల్, (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో ఇటీవల మరణించిన బాధిత కుటుంబ సభ్యులను వైఎస్ఆర్సీపీ నాయకులు నియోజకవర్గ ఇన్చార్జి బలసాని.కిరణ్ కుమార్ నేతృత్వంలో పర్యటించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సీపీ నాయకులు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సీపీ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బాధితులను పరామర్శిస్తున్నమన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి ఇటీవల మరణించిన, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కలిసి పరామర్శించారు. బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమం లో వైఎస్ఆర్సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జి బలసాని. కిరణ్ కుమార్, గుంటూరు పార్లమెంటు పరిశీలకులు పోతిన మహేష్, విజయవాడ పార్లమెంటు పరిశీలకులు మొదుగుల వేణుగోపాల్, నందిగామ నియోజకవర్గ ఇన్చార్జి మొండితోక జగన్ మోహన్, షేక్ నూరి ఫాతిమా, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గజ్జల. సుధీర్ భార్గవ్ రెడ్డి, అన్నబత్తుని శివ కుమార్, గులాం రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ వ్యవస్థలో సంస్కరణలు... డిప్యూటీ సీఎం కి కృతజ్ఞతలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. స్థానిక సంస్థల పాలనలో పారదర్శకత తీసుకువచ్చేలా సంస్కరణలు తీసుకువచ్చాము. వీటిని క్షేత్ర స్థాయిలో అమలు చేయడంలో సిబ్బంది పాత్ర కీలకం" అన్నారు.

పంచాయతీలను నాలుగు గ్రేడులుగా వర్గీకరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే వెసులుబాటు కలుగుతుందని అసోసియేషన్ ప్రతినిధులు చెప్పారు. 10 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పన చేపట్టడంతో అందరూ సంతోషంగా ఉన్నామని, మరింత ఉత్తేజంతో విధులు చేపడతామని వివరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేసిన పలు అంశాలపై ఉప ముఖ్యమంత్రి స్పందించి... వాటిపై పరిశీలన చేసి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు మా లక్ష్యం



**గుంటూరు (జర్నలిస్టు ఫైల్)** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో విద్యార్థుల సంక్షేమం కోసం ఎమ్మెల్యే గళ్ళా మాధవి చురుకైన చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 10 ఎస్సీ, 5 బీసీ, 4 ఎస్టీ హాస్టళ్ల పై ఎమ్మెల్యే గళ్ళా మాధవి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో హాస్టళ్లలో ఉన్న వసతులు, విద్యార్థుల భోజన నాణ్యత, స్టడీ హవర్స్ నిర్వహణ వంటి అంశాలపై కూలంకుషంగా చర్చ జరిగింది. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో చదవగలిగేలా చూడాలని ఆదేశించారు.ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధికారులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్తు సురక్షితం కావడానికి హాస్టళ్ల నిర్వహణలో ఎలాంటి రాజీ ఉండకూడదు. ప్రతి నెల మోటివేషన్ క్లాసులు నిర్వహించి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచాలి. అలాగే నాణ్యమైన భోజనం, శుభ్రమైన తాగునీరు అందేలా చూడాలి" అని అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా హాస్టళ్లలో అవసరమైన మౌలిక వసతుల కొరతలను గుర్తించి, వాటిని తీర్చేందుకు ప్రభుత్వంతో పాటు సేవా దాతల సహకారం కూడా కోరతామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ. ఎస్.డబ్ల్యూ అధికారులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## నాటక ప్రదర్శనలో మెమెంటోలు అందజేసిన మన్నవ





**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో "నారా చంద్రబాబు నాటకోత్సవం – 2025" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ బుధవారం రాత్రి పాల్గొన్నారు. నాటక ప్రదర్శనలు చేసిన వారికీ మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ...సమాజంలోని మంచి, చెడులను వివరిస్తూ ప్రజలకు మార్గదర్శకత్వం చూపించే దీక్ష రూపమైన నాటకం కాలక్రమేణా కనుమరుగవుతుండగా, ఆ నాటకాలకు పునరుజ్జీవం కల్పించి వాటికి పూర్వ వైభవం తీసుకురావడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అంతేకాక, కళాకారులకు అత్యంత గౌరవం దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మన్నవ మోహనకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజ్జల్ శ్రీనివాస్ ,, అభినయ శ్రీనివాస్ , రామరాజు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్‌పై రంగోలి పోటీలు




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్)** సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ గుంటూరు ఉత్సవ్ ను ఈ నెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో రంగోలి పోటీలను బుధవారం నిర్వహించారు. జిఎస్టి జాయింట్ కమిషనర్ బి.గీత మాధురి, సహాయ కమిషనర్ ఆర్ .అనసూయ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఉత్సవ్ ను జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు గురువారం ప్రారంభిస్తారని అన్నారు. ఉత్సవ్ కు ప్రత్యేకంగా లోగో తయారు చేయడం జరిగిందని చెప్పారు.

జి.ఎస్.టి 2.0 పై వినియోగదారులకు పూర్తి అవగాహన కల్పించేందుకు ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు జిల్లా ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు ఏ.సి కళాశాల ఆడిటోరియం హాల్ లో ఉత్సవ్ జరుగుతుందని అన్నారు. 16వ తేదీ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్, అమ్మ కాలు జరుగుతాయన్నారు. గృహోపకరణాలు, క్రీడా పరికరాలు, జిమ్ ఫిట్నెస్, సోలార్, బుక్స్ స్టేషనరీ, కెమిస్ట్ డ్రగ్గిస్ట్, అన్ని రకాల ఎలక్ట్రానిక్స్ వస్తువులు తదితర వాటికి సంబంధించిన దాదాపు 70 స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. జిల్లా ప్రజలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కొనసాగుతున్న దివ్యాంగులకు కృత్రిమ చేతులు పంపిణీ



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి వీటిజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కాలేజీలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో మంగళకరము అనే పేరుతో ఈనెల 14 నుండి 17 వరకు జరుగుతున్న నాలుగో విడత దివ్యాంగులకు కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైన బుధవారం 32 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు ప్రగడ రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రోటరీ ఇంటర్నేషనల్ 3150 ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జాస్తి రంగారావు హాజరై దివ్యాంగులకు కృత్రిమ చేతులను పంపిణీ చేశారు. అనంతరం రంగారావు మాట్లాడారు. దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతులు పంపిణీ చేయాలని రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి సంకల్పం ఎంతో అభినందనీయమన్నారు. దివ్యాంగులు వారి జీవితంలో ఎదుర్కొంటున్న చేదు అనుభవాలను వెల్లడిస్తుంటే మనసు చలించిపోతుందన్నారు. దివ్యాంగులకు కృత్రిమ చేతులు అమర్చిన తర్వాత వారి కళ్ళల్లో ఆనందం చూస్తే ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ ఇంటర్నేషనల్ 3150 డిస్ట్రిక్ట్ చైర్, ఆర్టిఫిషియల్ లింబ్స్ డీ సాంబశివరావు, అవార్డు కమిటీ చైర్మన్ డాక్టర్ పీ విష్ణు బాబు, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి కార్యదర్శి పారేపల్లి నిరంజన్ గుప్తా, ట్రెజరర్ కేవీఎస్ ప్రకాశరావు, ప్రాజెక్టు చైర్మన్ ఇసునూరి అనిల్ చక్రవర్తి, ఇమీడియట్ పాస్ట్ ప్రెసిడెంట్ గాజుల శ్రీనివాసరావు, రోటరీ ప్రతినిధులు రేవంత్ కుమార్, అందే మురళీ మోహనరావు, వడ్లమూడి శ్రీనివాసరావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, చనుమోలు గోపాల్, కాపరౌతు సుందరయ్య, అవ్వారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# చేతులు శుభ్రం చేసుకుంటే ఆరోగ్యం భద్రంగా ఉంటుంది



**గుమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** చేతులు శుభ్రంగా కడుక్కోవడం ఒక చిన్న అలవాటే కాదు, అది ఆరోగ్యాన్ని కాపాడే సాధనంగా ఉపయోగపడుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ప్రపంచ హ్యాండ్ వాష్ డే ని పురస్కరించుకొని ఐటిసి ఎంఎస్కే%డ%ఫినిష్ సొసైటీ రూపొందించిన వాల్ పోస్టర్ ని కమిషనర్ తమ చాంబర్ లో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, చేతులతో ఆహారం తీసుకోవడానికి ముందు శుభ్రం చేసుకోవాలని, దీని వలన డయేరియా, వైరల్ ఫీవర్, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందవని తెలిపారు. కనుక ప్రతి ఒక్కరూ తినడానికి ముందు చేతులను పరిశుభ్రంగా సబ్బుతో శుభ్రం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు ముప్పవరపు భారతి, దాసరి లక్ష్మీ జ్యోతి, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి, ఐటిసి ఫినిష్ సొసైటీ నారాయణ, పర్యావరణ విద్య నోడల్ అధికారి తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలో పోషణ అభియాన్

**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్):** ఐసీడీఎస్ కాకుమాను మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో పోషణ అభియాన్ కార్యక్రమం లు నిర్వహించారు. పాండ్రపాడు సెక్టార్ పరిదిలో జరిగిన కార్యక్రమం లలో సెక్టార్ సూపర్ వైజర్ ప్రేమలత పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ల లో భాగంగా వల్లూరు, గరికపాడు గ్రామాలలో సంప్రదాయ వంటకాల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. తల్లులకు వంటల పోటీలు నిర్వహించినారు. పిల్లలకు ఏటువంటి ఆహారాన్ని అందించాలో వివరించారు. ఈ కార్యక్రమం లలో మౌనిక, శిలర్, సిరాజుద్దీన్, అనితా, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాగునీరు అందించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరానికి త్రాగునీటిని అందించే హెడ్ వాటర్ వర్క్స్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సిబ్బంది మినహా ఇతరులను లోనికి రానివ్వద్దని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ జిఎంసి హెడ్ వాటర్ వర్క్స్, మానససరోవరం దగ్గర కల్వర్ట్, ఆర్టీసి కాలనీ, చిన్నేరు కుంట, కోబాల్ట్ పేటలో పీకలవాగు ఆక్రమణలను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలకు త్రాగునీటిని అందించే కీలకమైన హెడ్ వాటర్ వర్క్స్ లో ఇతరులు రాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సిసి కెమెరాలతో వాటర్ వర్క్స్ ప్రాంగణం పర్యవేక్షణ చేయాలన్నారు. అలాగే కృష్ణా నది నుండి వచ్చే నీటిని నిర్దేశిత శాస్త్రీయ విధానంలో శుద్ధి చేసి, ల్యాబ్ లో తనిఖీ చేసిన అనంతరమే సరఫరాకి పంపింగ్ చేయాలన్నారు. ల్యాబ్ లో ప్రతి రిపోర్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. హెడ్ వాటర్ వర్క్స్ లో మోటార్లు, ఇతర యంత్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మానస సరోవరం దగ్గర సర్వీస్ రోడ్ వెంబడి కల్వర్ట్ చిన్నదిగా ఉండడం వలన వర్షం నీరు రోడ్ మీదకు వస్తుందన్న ఫిర్యాదు మేరకు పరిశీలించి, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. చిన్నేరు కుంట ఆక్రమణలను, కోబాల్ట్ పేటలో పీకలవాగు ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు.

పర్యటనలో డిఈఈ రమేష్ బాబు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఇండస్ట్రియల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ పోస్టర్ ను విడుదల




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** ఏపీఐఐసీ - ఇండస్ట్రీ పార్ట్నర్‌షిప్ డ్రైవ్ పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా జిల్లాలో విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ పోస్టర్ ను కలెక్టర్ మంగళవారం విడుదల చేశారు. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న భాగస్వామ్య సదస్సు లో భాగంగా ఈ పోస్టర్ విడుదల జరిగింది. భాగస్వామ్య సదస్సు పై సంబంధిత వర్గాల్లో అవగాహన, భాగస్వామ్యం కల్పించదానికి అక్టోబర్ 15 నుండి నవంబరు 15వ తేదీ వరకు, నెల రోజులపాటు కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ చెప్పారు. భాగస్వామ్య సదస్సులో జిల్లా నుండి ఎక్కువ మంది భాగస్వామ్యం ఉండాలని కోరారు. నెల రోజుల పాటు జరిగే కార్యక్రమంలో ప్రతిరోజు వివిధ అంశాలను చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ఏపీఐఐసీ - ఇండస్ట్రియల్ పార్ట్నర్‌షిప్ డ్రైవ్ భాగంగా విస్తృత కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. పరిశ్రమల వృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ సమానంగా సాగాలని ఇందులో భాగంగా జిల్లా పరిధిలో పరిశ్రమల ఆధునికీకరణ, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమల అభివృద్ధి, శుభ్రత కార్యక్రమాలను ప్రోత్సహించే దిశగా జరుగుతుందని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీరు ఎం.డి.నజీనా బేగం, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ డాక్టర్ ఎం.ఎల్ నరసింహారావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఏ. జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్ర చేతులతోనే ఆరోగ్యకర జీవితం



**గుంటూరు (జర్నలిస్టు ఫైల్)** ప్రతిరోజు సబ్బుతో చేతులు కడుక్కోవడం అనే చిన్న అలవాటు ద్వారా, సురక్షిత ఆరోగ్య సమాజానికి బాటలు వేయవచ్చునని సిజిహెచ్ఎస్ ( సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం ) చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.హెచ్.కోటేశ్వరరావు వెల్లడించారు. బుధవారం గుంటూరు నగరంపాలెం లోని సిజిహెచ్ఎస్ వెల్ నెస్ సెంటర్ లో 'ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం' సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. సదస్సు లో డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. చేతుల పరిశుభ్రత అనేది సూక్ష్మజీవ వ్యాధుల వ్యాప్తి ని అరికట్టే అత్యంత సరళమైన ఆరోగ్య చర్య అన్నారు. భోజనానికి ముందు చేతులు కడకపోవటం వల్ల పలు రకాల ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా చేతివేళ్ళ గోళ్ళల్లో ఎటువంటి మలినాలు లేకుండా తగు జాగ్రత్త వహించాలన్నారు. సబ్బుతో ప్రతి ఒక్కరూ కనీసం ఇరవై సెకన్లు పాటు చేతులు కడగాలన్నారు. కరోనా మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా చేతుల పరిశుభ్రత ప్రాధాన్యతను పెంచిందన్నారు. పిల్లల్లో చేతుల పరిశుభ్రత అలవాటు పెంపొందించడం, దీర్ఘకాల ఆరోగ్యానికి పునాది వేయవచ్చునని సూచించారు. చేతుల శుభ్రతకు సంబంధించిన అంశాలను ప్రాథమిక దశ లోనే పాఠ్యంశాల ద్వారా విద్యార్థులకు భోధించాల్సిన అవసరం ఉందన్నారు. చేతుల శుభ్రతకు నాణ్యత గల శానిటైజర్లు, గ్లౌజులను తగిన సందర్భాల్లో ఉపయోగించాలని కోరారు. అనంతరం చేతులు కడిగే విధానాన్ని డాక్టర్ కోటేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో సిజిహెచ్ఎస్ ఫార్మాసిస్ట్ అయోషా బేగం సిబ్బంది మురళీ కృష్ణ, రామారావు, మోహన్, వెంకట్వేశ్వర్లు, మక్బుల్, రత్న రాజు పాల్గొన్నారు.

# అభివృద్ధి పొందిన పర్యవేక్షణకు సంయుక్తా కమిటీ ఏర్పాటు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్)** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల పరిశీలన, పర్యవేక్షణకు వివిధ రంగాల నిష్ణాతులతో ఒక సంయుక్త కమిటి ఏర్పాటుకు త్వరలో చర్యలు తీసుకుంటామని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో గుంటూరు నగర రేట్ పేయర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కమిషనర్ సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరంలో ప్రజల సౌకర్యార్థం నగరపాలక సంస్థ చేపట్టే అభివృద్ధి పనులు, త్రాగునీటి సరఫరా, పారిశుధ్యం మరింత ప్రణాళికాబద్ధంగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూజరిగేలా పర్యవేక్షణ చేయడానికి ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, పారిశుధ్య రంగాల్లో నిష్ణాతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కూడిన కమిటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కమిటి సభ్యులుగా రేట్ పేయర్స్ అసోసియేషన్ నుండి కూడా సభ్యులు ఉంటారని, వారి వివరాలు తమకు ఇవ్వాలని, మిగిలిన విభాగాల పేర్లు కూడా సేకరణ చేసి, పరిశీలన చేసిన అనంతరం నగరపాలక సంస్థ కౌన్సిల్ ల్లో చర్చించి, ఆమోదించి కమిటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రేట్ పేయర్స్ సభ్యులు తమ దృష్టికి తెచ్చిన అంశాలపై చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తామని తెలిపారు.

సమావేశంలో ఎస్ఈ (ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, ఈఈలు కోటేశ్వరరావు, విష్ణు, వేణు, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి, సదాశివరావు, రాఘవరావు, అంజిరెడ్డి పాల్గొన్నారు.

# అభివృద్ధి పొందిన పర్యవేక్షణకు సంయుక్తా కమిటీ ఏర్పాటు




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్)** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల పరిశీలన, పర్యవేక్షణకు వివిధ రంగాల నిష్ణాతులతో ఒక సంయుక్త కమిటి ఏర్పాటుకు త్వరలో చర్యలు తీసుకుంటామని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో గుంటూరు నగర రేట్ పేయర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కమిషనర్ సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరంలో ప్రజల సౌకర్యార్థం నగరపాలక సంస్థ చేపట్టే అభివృద్ధి పనులు, త్రాగునీటి సరఫరా, పారిశుధ్యం మరింత ప్రణాళికాబద్ధంగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూజరిగేలా పర్యవేక్షణ చేయడానికి ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, పారిశుధ్య రంగాల్లో నిష్ణాతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కూడిన కమిటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కమిటి సభ్యులుగా రేట్ పేయర్స్ అసోసియేషన్ నుండి కూడా సభ్యులు ఉంటారని, వారి వివరాలు తమకు ఇవ్వాలని, మిగిలిన విభాగాల పేర్లు కూడా సేకరణ చేసి, పరిశీలన చేసిన అనంతరం నగరపాలక సంస్థ కౌన్సిల్ ల్లో చర్చించి, ఆమోదించి కమిటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రేట్ పేయర్స్ సభ్యులు తమ దృష్టికి తెచ్చిన అంశాలపై చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తామని తెలిపారు.

సమావేశంలో ఎస్ఈ (ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, ఈఈలు కోటేశ్వరరావు, విష్ణు, వేణు, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి, సదాశివరావు, రాఘవరావు, అంజిరెడ్డి పాల్గొన్నారు.

# చిరస్మరణీయులు ఏపీజే అబ్దుల్ కలాం



**బాపట్ల,(జర్నలిస్ట్ ఫైల్):** భారత దేశ ప్రజలందరికి చిరస్మరణీయులు మాజీ భారత రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన.నరేంద్ర వర్మ రాజు తెలిపారు. ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బాపట్ల పట్టణంలోని త్రవ్వకాలవ దగ్గర ఉన్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి ఎంఎల్ఏ నరేంద్ర వర్మ రాజు పూలమాలవేసి నివాళులర్పించినారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, బాపట్ల పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, నాటక అకాడమీ డైరెక్టర్ మందపాటి ఆంధ్రేయ మరియు తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పూరణ్ కుమార్ ఆత్మహత్యపై జ్యుడీషియల్ విచారణ



**న్యూఢిల్లీ :** హర్యానా ఐపిఎస్ అధికారి వై.పూరణ్ కుమార్ ఆత్మహత్య ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ లేఖ రాశారు. కొంతమంది అధికారుల చేతుల్లో కుల వివక్షను, వేధింపులను ఎదుర్కొన్నానని పేర్కొంటూ పోలీసు అధికారి పూరణ్ కుమార్ ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటనపై తాము తీవ్రంగా ఆవేదన, ఆందోళన చెందుతున్నామని ఈ లేఖలో బేబీ పేర్కొన్నారు.

హర్యానా ఎడిజిపి పూరణ్ కుమార్ ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను ఎంఎ బేబీ నేతృత్వంలోని సిపిఎం ప్రతినిధి బృందం కలుసుకుంది, వారిని పరామర్శించింది. ఈ ప్రతినిధి బృందంలో బి.వి.రాఘవులు (పొలిట్‌బ్యూరో సభ్యులు), ప్రేమ్‌చంద్ (హర్యానా రాష్ట్ర కమిటీ కార్యదర్శి), ఇందర్‌జిత్ సింగ్ (హర్యానా రాష్ట్ర మాజీ కార్యదర్శి), ఆర్.ఎల్.మౌద్గిల్ (పంజాబ్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వున్నారు. ఆ పర్యటన ముగిసిన వెంటనే బేబీ ప్రధాని మోడీకి లేఖ రాశారు.

పూరణ్ కుమార్ ఆత్మహత్య ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. పైగా సమాజంలో వెనుకబడిన వర్గాలకు చెందిన అధికారులకు పోలీసు సర్వీస్‌లో అందుబాటులో వున్న రక్షణ యంత్రాంగాలు, జవాబుదారీతనం, పని పరిస్థితుల గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తిందని ఆ లేఖ పేర్కొంది. ముఖ్యంగా అద్భుతమైన సర్వీసు రికార్డు కలిగిన దళిత అధికారి పూరణ్ కుమార్ ఇటువంటి తీవ్రమైన చర్యకు పాల్పడే పరిస్థితులు తలెత్తడం విచారకరమని ఆ లేఖ పేర్కొంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ దళిత విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య ఇంకా అనేకమంది దళిత విద్యార్థులు, అధికారులు భరించనలవికాని కుల వివక్ష, వ్యవస్థాగతమైన వేధింపులు కారణంగా తమ ప్రాణాలను బలవంతంగా తీసుకుంటున్న ఘటనలు చూస్తుంటే మన వ్యవస్థలను పట్టి పీడిస్తున్న వ్యవస్థాగత అణచివేత ఎలా వుందో తెలుస్తోందని ఆ లేఖ పేర్కొంది.

తాము వ్యక్తిగతంగా వెళ్ళి చండీఘడ్‌లోని పూరణ్ కుటుంబ సభ్యులను కలిశామని, వారితో మాట్లాడి వారి ప్రగాఢమైన ఆవేదన, విచారం గురించి తెలుసుకున్నామని బేబీ ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ ఘటనలో వాస్తవాన్ని వెలికితీసి, న్యాయం జరిగేలా చూసేందుకు గానూ స్వతంత్ర, పారదర్శక విచారణ జరగాల్సి వుందని వారి మాటలను బట్టి స్పష్టమవుతోందని అన్నారు.

ఈ పరిస్థితుల నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో జ్యుడీషియల్ విచారణకు ఆదేశాలు జారీ చేయాలని, పూరణ్ కుమార్ ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులపై అలాగే కుల వేధింపుల ఆరోపణలు, వ్యవస్థాగత తోడ్పాటు అందడంలో లోపాల గురించి దర్యాప్తు చేపట్టాలని ఆ లేఖ కోరింది.

జ్యుడీషియల్ విచారణ నివేదిక వచ్చే వరకు పూరణ్ కుమార్ తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్న అధికారులందరినీ తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దర్యాప్తు క్రమాన్ని ఏ రకంగానూ ప్రభావితం చేయకుండా వుండేందుకు ఈ చర్య తీసుకోవడం తప్పనిసరని లేఖలో పేర్కొన్నారు.

సక్రమ, పారదర్శక జ్యుడీషియల్ విచారణ వల్ల ఇప్పటికే మనోవేదనను అనుభవిస్తున్న ఆ కుటుంబానికి ఊరట కలగడమే కాకుండా రాజ్యాంగ విలువల పట్ల దేశ నిబద్ధతను పునరుద్ఘాటిస్తుందని, అలాగే ప్రభుత్వ ఉద్యోగులు ఏ రకమైన వివక్షను ఎదుర్కొనకుండా రక్షణ కల్పిస్తుందని ఆ లేఖ పేర్కొంది.

ఈ విషయంలో ప్రధాని కార్యాలయం అత్యవసరంగా స్పందించి, తగు చర్యలు తీసుకోగలదని విశ్వసిస్తున్నామని కామ్రేడ్ బేబీ ఆ లేఖలో పేర్కొన్నారు.

# కరూర్ తొక్కిసలాట ఘటనకు విజయ్ ఆలస్యంగా రావడమే కారణం

**చెన్నై :** కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనకు టివికె అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ ఆలస్యంగా రావడమే ప్రధాన కారణమని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తెలిపారు. కరూర్ తొక్కిసలాట ఘటనపై తమిళనాడు అసెంబ్లీలో చర్చజరిగింది. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ మాట్లాడుతూ.. కరూర్ తొక్కిసలాట ఘటన తమిళనాడు మొత్తాన్ని కలచివేసిందన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ఆయన సానుభూతి వ్యక్తం చేశారు. టివికె షెడ్యూల్ తప్పిదాలే ఘటనకు కారణమన్నారు.

ర్యాలీకి విజయ్ మధ్యాహ్నం వస్తారని పార్టీ పేర్కొనగా.. ఆయన ఏడు గంటల తర్వాత వచ్చారని వెల్లడించారు. అప్పటికే పెద్ద ఎత్తున జనం గుమిగూడారన్నారు. ప్రచార వాహనం జనంలోకి వెళ్తుండగా.. గందరగోళం నెలకొనడంతో పాటు ఊపిరాడని కారణంగా తొక్కిసలాట చోటుచేసుకుందన్నారు. విజరు ఆలస్యమే తొక్కిసలాటకు ముఖ్యకారణమన్నారు. ఈ క్రమంలో కొందరు జనరేటర్ ఉన్న గదిలోకి ప్రవేశించి దాన్ని నిలిపివేశారన్నారు. తాగునీటితో సహా సరైన ప్రాథమిక సౌకర్యాలు కల్పించడంలో టివికె విఫలమైందని విమర్శించారు. క్షతగాత్రులకు సాయం చేసేందుకు అత్యవసర సేవల సిబ్బంది ప్రయత్నిస్తుండగా.. టివికె కార్యకర్తలు రెండు అంబులెన్స్‌లపై దాడి చేశారన్నారు.

# 71 మందితో బీహార్ బిజెపి తొలి జాబితా

## కేంద్ర మాజీ మంత్రి, ఇద్దరు డి.సిఎంలకు చోటు, స్పీకర్ నందకిశోర్ యాదవ్‌కు దక్కని కమలం టిక్కెట్

**పాట్నా, అక్టోబరు 15 :** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బిజెపి 71 మంది పేర్లతో తొలి జాబితా విడుదల చేసింది. ఇందులో 9 మంది మహిళలకు కమలం పార్టీ టికెట్లు ఇచ్చింది. ఈ జాబితాలో మాజీ కేంద్ర మంత్రి రాంక్రిపాల్ యాదవ్, ఇద్దరు డిప్యూటీ సిఎంలు పేర్లుండగా, స్పీకర్ నందకిశోర్ యాదవ్‌కు చోటు దక్కలేదు. డిప్యూటీ సిఎంలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హాల తారాపూర్, లఖిసరాయ్‌ల నుంచి పోటీ చేస్తుండగా, మాజీ కేంద్ర మంత్రి రాంక్రిపాల్ యాదవ్ దానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతున్నారు. ఇక అసెంబ్లీ స్పీకర్ నందకిశోర్ యాదవ్ 2010 నుంచి పాట్నా సాహిబ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఈసారి ఆ స్థానం నుంచి రత్నేష్ కుశ్వాహాను బిజెపి బరిలోకి దించింది. సీనియర్ బిజెపి నేత, మాజీ మంత్రి తార్‌కిశోర్ ప్రసాద్ (కటిహార్), ఆరోగ్య మంత్రి మంగల్ పాండే (సివాన్), మరో మంత్రి నితిన్ నబిన్ (బంకిపూర్)లకు తొలి జాబితాలోనే టికెట్లు దక్కించుకున్నారు. కామన్‌వెల్త్ గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్ శ్రేయాసి సింగ్ మరోమారు జముయి నియోజకవర్గంలో తన భవితవ్యం తేల్చుకోనున్నారు. 243 బీహార్ అసెంబ్లీలో ఎన్‌డిఎ కూటమి తరఫున బిజెపి 101, జెడియు 101, ఎల్‌జెపి(ఆర్‌వి) 29, ఆర్‌ఎల్‌ఎం 6, హెచ్‌ఎఎం 6 సీట్లలో పోటీ చేస్తున్నాయి. ఈ మేరకు కూటమిలోని పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కుదిరిన విషయం తెలిసిందే.





### ప్రశాంత్ కిశోర్ 65 మందితో రెండో జాబితా

ప్రశాంత్ కిశోర్ తన జన్ సురాజ్ పార్టీ తరఫున 65 మంది అభ్యర్థుల పేర్లతో రెండో జాబితాను విడుదల చేశారు. ప్రతి వర్గానికి ప్రాతినిధ్యం కల్పిస్తామని చెబుతూ వస్తున్న ప్రశాంత్ కిశోర్ ఆమేరకు కుల, మత, వర్గ సమీకరణాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అత్యంత వెనుకబడిన తరగతులకు చెందిన 14 మందికి పీకే అవకాశం కల్పించారు. అలాగే మైనారిటీలకు 14 సీట్లు కేటాయించారు. మరో 10 మంది ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థులను జన్ సూరజ్ పార్టీ తరఫున పోటీ చేయిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు 116 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ప్రశాంత్ కిశోర్, ఏ స్థానం నుంచి పోటీ చేస్తున్నది ఇంకా వెల్లడించలేదు. అసలు పోటీ చేస్తాడా లేదా అన్నదానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. 1989 భాగల్పూర్ అల్లర్ల బాధితుల తరఫున ఉచితంగా వాదించిన లాయర్ అభయ్ కాంత్ ఝా, సివాన్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ షానవాజ్ ఆలం బధారియా నుంచి పోటీ చేయనున్నారు. రిటైర్డ్ పోలీస్ అధికారి నస్రుల్లా ఖాన్ నోఖా (రోహ్తాస్) నుంచి, ప్రొఫెసర్ శశికాంత్ ప్రసాద్ పుల్వారీ నుంచి బరిలోకి దిగుతున్నారు. మొదటి జాబితా(51)లోని అభ్యర్థులలో 49 మంది తొలిసారి పోటీ చేస్తున్న వారే. మలి జాబితాలోనూ వైద్యులు, న్యాయవాదులు, సివిల్ సర్వీసెస్ మాజీ అధికారులున్నారు.


### తండ్రి టికెట్లిచ్చాడు.. కొడుకు వెనక్కి తీసుకున్నాడు

బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మహాకూటమిలో కీలక భాగస్వామి ఆర్‌జెడిలో తండ్రి, కొడుకుల మధ్య టికెట్ల పంచాయతీ రచ్చకెక్కింది. సోమవారం మధ్యాహ్నాం అధినేత లాలూప్రసాద్ యాదవ్ తమ పార్టీ విధేయులు కొందరికి ఫోన్ చేసి, ఇంటికి ఆహ్వానించారు. వారికి స్వయంగా బి.ఫారాలు అందజేశారు. కార్యకర్తలు, అనుచరులతో సంబరాలు చేసుకుంటూ స్వస్థలాలకు వెళ్లిపోయారు. టికెట్ల విషయం తెలిసిన లాలూ తనయుడు తేజస్వి యాదవ్ తండ్రి లాలూపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఎవరెవరికి టికెట్లు తీసుకున్నారో వారందరికీ రాత్రి ఫోన్ చేసి, ఆయా బి.ఫారాలు వెనక్కి తీసుకున్నాడు. మహాఘట్ బంధన్‌కు సంబంధించి సీట్ల సర్దుబాటు ఇంకా కొలిక్కి రాలేదు. అప్పుడే టికెట్ల కేటాయింపు మంచిది కాదని, అందుకే తేజస్వి యాదవ్ ఆ నిర్ణయం తీసుకున్నారని ఆర్‌జెడి పార్టీ వర్గాలు తెలిపాయి. తండ్రి టికెట్లు ఇస్తే, కొడుకు వెనక్కి తీసేసుకున్నాడంటూ బీహార్ రాజకీయ వర్గాలలో చర్చనీయాంశమైంది.

**మహాకూటమికి కుదిరిన సీట్ల సర్దుబాటు?**

ఆర్‌జెడి- కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్ బంధన్ కూటమిలో సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఆర్‌జెడి 135, కాంగ్రెస్ 61 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. మిగిలిన సీట్లలో కూటమిలోని పార్టీలకు కేటాయించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు ఆర్‌జెడి పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు సిపిఐ(ఎంఎల్) 18 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది.

# పాక్ పిఎం ప్రశంసలతో ట్రంప్ ఉక్కిరిబిక్కిరి




**ఇస్లామాబాద్, అక్టోబరు 15 :** ఇజ్రాయెల్-హమాస్‌ల యుద్ధం ముగింపునకు సంబంధించి ఈజిప్టులోని షర్మ్-షేక్‌లో శాంతి ఒప్పందంపై దేశాధినేతలు సంతకాలు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ ట్రంప్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. ఆయనంత గొప్ప అధ్యక్షుడు లేడన్నట్లు వ్యాఖ్యలు చేశారు. షరీఫ్ మాటలకు ట్రంప్ ఉక్కిరిబిక్కిరి అయిపోయారు. చివరకు తాను మాట్లాడాల్సింది ఏమి లేదంటూ చేతులెత్తేసి ఇంటికి వెళ్లిపోదామంటూ షరీఫ్‌తో చమత్కరించారు. షెహబాజ్ మాట్లాడుతూ 'ఈ రోజు చరిత్రలో గొప్ప రోజులలో ఒకటి. ఎందుకంటే అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలో అవిశ్రాంత ప్రయత్నాల తర్వాత గాజాలో శాంతి సాధన అయ్యింది. ఆయన నిజంగా శాంతిని కోరుకునేవాడు. ట్రంప్ ఈ ప్రపంచాన్ని శాంతి, శ్రేయస్సుతో జీవించేలా చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేశారు' అని కొనియాడారు. ఈ సందర్భంగా భారత్-పాక్ మధ్య జరిగిన ఘర్షణను కూడా ట్రంపే ఆపారంటూ క్రెడిట్ ఇచ్చేశారు.'భారత్-పాక్ మధ్య యుద్ధాన్ని ఆపడంతోపాటు కాల్పుల విరమణ సాధించడానికి ట్రంప్ అసాధారణ ప్రయత్నాలు చేశారు. భారత్-పాక్ రెండూ అణ్వస్త్ర శక్తులు. ఆ నాలుగు రోజుల్లో ట్రంప్, ఆయన అద్భుతమైన బృందంతో జోక్యం చేసుకోకపోతే.. ఆ ఘర్షణలు పశ్చిమాసియాకు విస్తరించి ఉండేవి. ఏం జరిగిందో చెప్పేందుకు కూడా ఎవరూ మిగిలేవారు కాదు. ఇందుకుగాను నోబెల్ శాంతి బహుమతికి పాక్ ఆయన్ను నామినేట్ చేసింది. ఇది అందుకునేందుకు ఆయన అర్హుడు. ఇప్పటివరకు ఏడు యుద్ధాలు ఆపారు. ఇది ఎనిమిదవది' అంటూ షరీఫ్ తన ప్రసంగాన్ని ముగించారు. షరీఫ్ ప్రసంగం నేపథ్యంలో అక్కడే ఉన్న ఇటలీ ప్రధాని జార్జియా మెలోని నోటిమీద చేయి వేసుకొని చూస్తూ ఉండిపోయారు. షరీఫ్ ప్రసంగం తర్వాత ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. షరీఫ్ ప్రసంశలతో ఉబ్బితబ్బిబ్బయిన ట్రంప్ ఇది తాను ఊహించలేదన్నారు. ఇంకా తాను మాట్లాడేందుకు ఏమీ లేదంటూ ఇంటికి వెళ్దాం అంటూ చమత్కరించారు. దీంతో ఆ ప్రాంగణం మొత్తం నవ్వులు విరిశాయి.

### షరీఫ్ సమక్షంలోనే ట్రంప్ భారత్‌పై పొగడ్తలు

#### ఆ దేశంతో గొడవ పడకండి అంటూ పాక్ ప్రధానికి హితవు

**కైరో, అక్టోబరు 15 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై పొగడ్తలు కురిపించారు. ఇండియా చాలా గొప్ప దేశమని, తన స్నేహితుడు అక్కడ ఉన్నత పదవిలో ఉన్నాడని వ్యాఖ్యానించారు. ఈజిప్ట్‌లో జరిగిన పీస్‌సమ్మిట్‌లో ట్రంప్ ఈ వ్యాఖ్యలుచేశారు. ఈ సమిట్‌కు ప్రపంచ దేశాల అధ్యక్షులు, ప్రధానులు, ప్రతినిధులు హాజరయ్యారు. ట్రంప్ వెనకే పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ఉన్నారు. ట్రంప్ తన ప్రసంగంలో భాగంగా భారత్‌ను పొగడడంతో పాటు ఇండియా, పాక్ సామరస్యంగా కలిసి ఉంటాయని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా తన వెనకే ఉన్న పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను ఇదే విషయమై అక్కడికక్కడే ప్రశ్నించారు. భారత్‌తో గొడవ పడకుండా కలిసి ఉంటారు కదా?అని అడగగా షెహబాజ్ షరీఫ్‌కు ఏం చెప్పాలో అర్థంకాక అలాగే అన్నట్లు నవ్వుతూ తలూపడం కనిపించింది.



### మీరు చాలా అందంగా ఉన్నారు..

#### ఇటలీ ప్రధానిపై అమెరికా అధ్యక్షుడు ప్రశంసలు

**కైరో, అక్టోబరు 15 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో మరో సారి వార్తల్లో నిలిచారు. ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీని ఉద్దేశించి ఆయన చేసిన కొన్ని సరదా వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఓ అంతర్జాతీయ కార్యక్రమంలో ఇతర దేశాధినేతల సమక్షంలో మెలోనీ అందాన్ని ఆయన బహిరంగంగా ప్రశంసించారు. ఈజిప్టులో జరిగిన ఓ శాంతి ఒప్పందంపై సంతకాల కార్యక్రమానికి ట్రంప్, మెలోనీ సహా పలువురు నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, నిజానికి ఇలాంటి మాటలు చెప్పడానికి నాకు అనుమతి లేదు. బహుశా ఇలామాట్లాడితే నారాజకీయ జీవితం కూడా ముగిసిపోవచ్చు. అయినా సరే నేను ఆ అవకాశాన్ని తీసుకుంటున్నానని అన్నారు. అనంతరం మెలోనీ వైపు చూస్తూ, మిమ్మల్ని అందంగా ఉన్నారని పిలవడంలో మీకు ఎలాంటిఅభ్యంతరంలేదు కదా? ఎందుకంటే మీరునిజంగానే అలా ఉన్నారని పేర్కొన్నారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలతో అక్కడి వాతావరణం ఒక్కసారిగా ఆహ్లాదకరంగా మారింది. ప్రధాని మెలోనీతో పాటు అక్కడ ఉన్న ఇతర నేతలందరూ నవ్వులు చిందించారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ జార్జియా మెలోనీ ఒక అద్భుతమైన నాయకురాలని కొనియాడారు. శాంతి ఒప్పందం కోసం ఆమె ఇక్కడికి వచ్చినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించినవీడియోలు ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

# అమెరికా అధ్యక్షుడికి మాజీల ప్రశంసలు

## గాజా శాంతి ఒప్పందంపై ప్రపంచనేతల హర్షం



**కైరో, అక్టోబరు 15 :** అమెరికా రాజకీయాల్లో అరుదుగా కనిపించే దృశ్యం ఆవిష్కృతమైంది. ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆయన రాజకీయ ప్రత్యర్థులు, మాజీ అధ్యక్షులు జో బైడెన్, బిల్ క్లింటన్ ప్రశంసల వర్షం కురిపించారు. ఇజ్రాయెల్‌హమాస్ మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరదించుతూ, ట్రంప్ చొరవతో కుదిరిన శాంతి ఒప్పందమే ఈ అనూహ్య పరిణామానికి కారణమైంది. ఈ ఒప్పందంలో భాగంగా, రెండేళ్లుగా హమాస్ చెరలో ఉన్న 20 మంది ఇజ్రాయెలీ బందీలు సురక్షితంగా తమ స్వదేశానికి చేరుకున్నారు. ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళికలో భాగంగా ఈ కీలక ముందడుగు పడింది. ఈ ఒప్పందంపై మాజీ అధ్యక్షుడు జో బైడెన్ హర్షం వ్యక్తం చేశారు. గాజా ఒప్పందాన్ని ఆయన స్వాగతించారు. ఇలాంటి ఒప్పందం కుదిరేలా చూడటం సులభమైన విషయం కాదు. బందీల విడుదల చాలా సంతోషాన్నిచ్చిందని ఆయన అన్నారు. అమెరికా, ప్రపంచ దేశాల మద్దతుతో మధ్యప్రాచ్యం శాంతి బాట పడుతోందని బైడెన్ వ్యాఖ్యానించారు. మరో మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ కూడా ట్రంప్ దౌత్యాన్ని కొనియాడారు. హమాస్ దాడితో మొదలైన ఘర్షణలో జరిగిన మానవ నష్టం తీవ్రంగా బాధించింది. ఇప్పుడు కాల్పుల విరమణ జరగడం, 20 మంది బందీలు విడుదల కావడం, గాజాకు మానవతా సాయం అందడం గొప్ప విషయం. ఈ ఘనత అధ్యక్షుడు ట్రంప్, ఆయన బృందం, ఖతార్ వంటి దేశాలకు దక్కుతుందని క్లింటన్ ప్రశంసించారు. రాజకీయ ప్రత్యర్థుల నుంచి వస్తున్న ఈ పొగడ్తలపై అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ, ఇదంతా చాలా బాగుంది. వారు వాస్తవాలు మాట్లాడుతున్నారని అన్నారు. కాగా, ఈజిప్టులోని షర్మ్ ఎల్‌షేక్‌లో ఈ చారిత్రక శాంతి ఒప్పందంపై అధికారికంగా సంతకాలు జరిగాయి. పలు దేశాల అగ్రనేతల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఈ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలి సంతకం చేయగా, ఆ తర్వాత ఈజిప్టు, ఖతార్, తుర్కియే అధినేతలు సంతకాలు చేశారు.

# పింఛన్ విత్‌డ్రాలలో భారీ మార్పులకు ఇపిఎఫ్‌ఓ నిర్ణయం




**న్యూఢిల్లీ, అక్టోబరు 15 :** ఏడుకోట్లకు పైగా పీఎఫ్ చందాదారుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని పాక్షిక విత్‌డ్రాలకు సంబంధించిన నిబంధనలు సరళీకరిస్తూ ఈపీఎఫ్‌వో బోర్డు నిర్ణయం తీసుకుంది. చందాదారులు తమ ఈపీఎఫ్ ఖాతా నిల్వలో వంద శాతం వరకు విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మాండవీయ నేతృత్వంలో జరిగిన ఈపీఎఫ్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) సమావేశంలో పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నట్టు కార్మిక మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. ఈపీఎఫ్ సభ్యుల సౌకర్యార్థం ఈపీఎఫ్ స్కీమ్‌లోని పాక్షిక విత్‌డ్రా నిబంధనలను సులభతరం చేయాలని సీబీటీ నిర్ణయించింది. తాజా నిర్ణయంమేరకు చందాదారులు ఉద్యోగి, యజమాని వాటాతో సహా ప్రావిడెంట్ ఫండ్‌లోని అర్హమైన బ్యాలెన్స్‌లో వంద శాతం వరకు విత్‌డ్రాచేసుకునే అవకాశం ఉంటుంది. ఈమేరకు 13 క్లిష్టమైన నిబంధనలను ఒక నిబంధనగా క్రమబద్ధీకరించింది. దీనిని మూడు రకాలుగా వర్గీకరించింది. అవి ముఖ్యమైన అవసరాలు (అనారోగ్యం, విద్య, వివాహం), గృహ అవసరాలు, ప్రత్యేక పరిస్థితులు. మరోవైపు ఉపసంహారణ పరిమితులను కూడా సరళీకరించారు. విద్య కోసం విత్‌డ్రాలు పదిసార్ల వరకు, వివాహం కోసం ఐదుసార్ల వరకు అనుమతించారు. ఇక అన్ని పాక్షిక విత్‌డ్రాలకు సంబంధించిన కనీస సర్వీసును 12 నెలలకు తగ్గించారు. ఇంతకు ముందు ప్రత్యేక పరిస్థితుల కింద చందాదారు పాక్షిక ఉపసంహరణకు సంబంధించి ప్రకృతి విపత్తు, సంస్థల లాకౌట్లు/మూ సివేతలు, నిరుద్యోగం, మహమ్మారుల విజృంభణ వంటి కారణాలను స్పష్టం చేయాల్సిన అవసరం ఉండేది. ఇప్పుడు చందాదారు ఏ కారణాన్ని పేర్కొనకుండానే దరఖాస్తు చేసుకో వచ్చు. పీఎఫ్ ఖాతాలో జమ చేసే మొత్తంలో 25 శాతాన్ని కనీస నిల్వగా ఉంచాలన్న నిబంధన తీసుకువచ్చారు. దీంతో ఈపీఎఫ్‌వో అందించే అధిక వడ్డీ రేటు (ప్రస్తుతం 8.25 శాతం వడ్డీ) ప్రయోజనాన్ని సభ్యులు పొందడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇది పదవీ విరమణ సమయానికి నిధిని కూడబెట్టుకోవడానికి దోహదపడనుంది. ఈపీఎఫ్ ముందస్తు ఫైనల్ సెటిల్‌మెంట్‌ను పొందే వ్యవధిని ప్రస్తుత 2 నెలల నుంచి 12 నెలలకు మార్చారు. అలాగే తుది పెన్షన్ ఉపసంహారణ వ్యవధిని 2 నెలల నుంచి 36 నెలలకు మార్చారు. కాగా ఈపీఎఫ్ 95 పెన్షనర్ల ఇంటి వద్దనే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (డీఎల్‌సీ) సర్వీసులు అందించడానికి గాను ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ)తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకోవడానికి బోర్డు ఆమోదం తెలిపింది. కాగా. వచ్చే నెల 1నుంచి పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు (డీఎల్‌సీ) ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఈ కార్యక్రమం 30 వరకు అమలు కానుంది.



# సముద్రంలోనూ యుఎస్-చైనా ట్రేడ్ వార్

### నౌకలపై సైతం ప్రత్యేక ఫీజులు

**బీజింగ్, అక్టోబరు 15 :** అమెరికా-చైనా మధ్య ఇటీవల వాణిజ్య ఉద్రిక్తతలు మరోసారి భగ్గు మన్న సంగతి తెలిసిందే. బీజింగ్‌పై అదనంగా 100 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనతో ఇరు దేశాల మధ్య మళ్లీ వాణిజ్య యుద్ధం రాజుకుంది. తాజాగా ఇరు దేశాలు నౌకలపై పరస్పర ప్రత్యేక ఫీజులు ప్రకటిం చాయి. అమెరికా యాజమాన్యం నిర్వహణలో ఉన్న నౌకలు, యుఎస్ నిర్వహించే లేదా ఆ దేశ జెండాలతో వచ్చే ఓడలపై ప్రత్యేక ఛార్జీలను వసూలు చేస్తున్నట్లు చైనా మంగళవారం ప్రక టించింది. అయితే, చైనా నిర్మించిన నౌకలకు ఈ ఫీజుల నుంచి మినహాయింపు ఉంటుందని స్పష్టం చేసింది. అటు అమెరికా కూడా మంగ ళవారం నుంచి ఈ ఫీజులు వసూలు ప్రారం భించింది.

**చివరి వరకూ పోరాడతాం: చైనా:** మరోవైపు, అమెరికా అదనపు సుంకాలపై చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పందించింది. 'వాణిజ్య యుద్ధం, టారిఫ్‌ల అంశంపై మా వైఖరి స్థిరంగా ఉంది. మీరు (అమెరికాను ఉద్దేశిస్తూ) యుద్ధం కోరుకుంటే మే చివరి వరకూ పోరాడతాం. అదే చర్చలు కావాలనుకుంటే మా తలుపులు తెరిచే ఉన్నాయి' అని వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు.

ప్రపంచంలో ఎక్కడా దొరకని అరుదైన ఖనిజాల ఎగుమతిపై ఇటీవల చైనా నియంత్రణలు విధించింది. ఇకపై విదేశీ కంపెనీలు వాటిని దిగుమతి చేసుకోవాలంటే ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఇది ట్రంప్‌నకు కోపం తెప్పించింది. దీంతో బీజింగ్‌పై 100 శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. అవి నవంబరు 1వ తేదీ నుంచి గానీ, అంతకు ముందు నుంచి గానీ అమలులోకి వస్తాయని తెలిపారు. దీంతోపాటు చైనాకు అమెరికా సంస్థలు ఎగుమతి చేసే కీలక సాఫ్ట్‌వేర్‌ల పైనా నియంత్రణలు విధిస్తామని వెల్లడించారు.

# అఫ్ఘాన్‌తో సంబంధాలు నిలిపేశాం..

## పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్



**ఇస్లామాబాద్, అక్టోబరు 15 :** అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఇరుదేశాల బలగాల మధ్య ఘర్షణలు తీవ్రతరమయ్యాయి. ఈ క్రమంలో పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అఫ్ఘాన్‌తో ఉన్న అన్ని సంబంధాలను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఓ వార్తా సంస్థకు సంబంధించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ప్రస్తుతం ప్రతిష్టంభన నెలకొంది. శత్రుత్వాలు లేవని మీరు చెప్పొచ్చు. కానీ ప్రస్తుత పరిస్థితులు దానికి ప్రతికూలంగా ఉన్నాయి. నేటికి దానితో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి సంబంధాలు లేవు' అని పేర్కొన్నారు. ఈ క్రమంలో రెండు దేశాల మధ్య ఉన్న శత్రుత్వం తిరిగి ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా చర్చలకు అవకాశం ఉంటుందా అనే ప్రశ్నకు.. బెదిరింపులతో కూడి చర్చలు సరికావన్నారు. బెదరింపులపై చర్యల తర్వాత చర్చలకు అంగీకరిస్తామన్నారు. ఈ సందర్భంగా పాక్ సైనిక ప్రతిస్పందనకు ఆసిఫ్ మద్దతిచ్చారు. దాడికి ప్రతిదాడి సహజమన్నారు. పౌరులను, వారు ఉన్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోలేదన్నారు. కేవలం వారి రహస్య స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపారు. అఫ్ఘాన్ పలు ఉగ్రవాద సంస్థలకు ఆశ్రయం కల్పిస్తోందని ఆరోపించారు. అక్కడ అంతర్జాతీయ ఉగ్రవాదం ఉందని ప్రపంచానికి తెలుసన్నారు. తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్ (టిటిపి) చీఫ్ నూర్ వలీ మెహ్సూద్ గురించి అడగ్గా తాము లక్ష్యంగా చేసుకున్న వ్యక్తి వారి భూభాగంలోనే ఉన్నారని ఆసిఫ్ బదులిచ్చారు. ఈ సందర్భంగా దౌత్య ప్రయత్నాలలో నిజాయితీ అవసరమన్నారు.

పొరుగు దేశాలు మాతో సంతోషంగానే ఉన్నాయి. తాజా ఉద్రిక్తతలపై అఫ్ఘానిస్థాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ మాట్లాడారు. పాక్ తప్ప, పొరుగు దేశాలన్నీ తమతో సంతోషం గానే ఉన్నాయన్నారు. తమకు ఎవరితోనూ గొడ వలు అక్కర్లేదన్నారు. అఫ్ఘాన్‌లో శాంతి ఉందన్నారు.

# సంక్షిప్తంగా..

### మలేసియాలో చిన్నారులను కబళిస్తున్న వింతవైరస్..



**కౌలాలంపూర్, అక్టోబరు 15 :** మలేషియాలో వేల మంది చిన్నారులు ఫ్లూ తరహా వ్యాధి బారినపడటం కలకలానికి దారి తీసింది. కొవిడ్ సంక్షోభం తొలి రోజులను గుర్తుకు తెస్తున్న ఈ పరిణామంతో అప్రమత్తమైన ప్రభుత్వం వెంటనే పలు స్కూళ్లకు సెలవులు ప్రకటించింది. అయితే, ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకునేందుకు తగిన అనుభవం వైద్య సిబ్బందికి ఉందని అక్కడి వైద్య శాఖ డైరెక్టర్ జనరల్ మహమ్మద్ ఆజమ్ అహ్మద్ తెలిపారు. ఇన్‌ఫెక్షన్ల వ్యాప్తి నిరోధానికి సంబంధించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా ఫాలో కావాలని స్కూల్ యాజమాన్యాలకు సూచించారు. ఎన్ని స్కూళ్లకు సెలవులు ప్రకటించారనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడంచలేదు . దేశ వైద్య శాఖ సమాచారం ప్రకారం, పలు ప్రాంతాల్లో చిన్నారులు ఫ్లూ తరహా ఇన్‌ఫెక్షన్ల బారిన పడ్డారు. 97 ప్రాంతాల్లో కేసుల సంఖ్య అధికంగా ఉంది. అంతకుముందుకు 14 ప్రాంతాల్లో కేసుల సంఖ్య ఎక్కువగా ఉండగా కేవలం వారం రోజుల్లో ఇన్‌ఫెక్షన్ క్లస్టర్ల సంఖ్య 97కు చేరుకుంది.

### మిలిటెంట్ల చొరబాట్లను భగ్నంచేసిన ఆర్మీ

**శ్రీనగర్, అక్టోబరు 15 :** జమ్మూకశ్మీర్‌లో నియంత్రణ రేఖ వెంబడి సోమవారం మరోసారి ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. కుప్వారా జిల్లాలోని మచిల్, దుద్నియాల్ సెక్టర్‌లో చొరబాటు యత్నాలను భద్రతా దళాలు భగ్నం చేశాయి. ఇద్దరు ఉగ్రవాదులను మట్టుపెట్టాయి .మచ్చిల్ సెక్టర్‌లో నియంత్రణ రేఖకు సమీపంలో సోమవారంరాత్రి భద్రతా దళాలు ఉగ్రవాదుల కదలిక్ని గుర్తించాయి. ఈ క్రమంలో ఎన్‌కౌం టర్ జరగ్గా భారత సైన్యం జరిపిన కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఇక దుద్నియాల్ సెక్టర్‌లో పేలుళ్లు సంభవించడం ఆందోళనకు దారి తీసింది.దీంతో, భద్రతాదళాలు ఆ ప్రాంతమంతా జల్లెడ పట్టాయి. సరిహద్దు వెంబడి మళ్లీ చొరబాట్లకు ప్రయ త్నాలు మొదలయ్యాయన్న ఆందోళన వ్యక్తమవు తోంది. ఇప్పటికే భద్రతా దళాలు అనుమా నాస్పద ప్రాంతాల్లో ఉగ్రవాద ఏరివేత చర్యలు ప్రారంభించాయి. ఉగ్రవాదులకు సహకరిస్తున్న హ్యాండర్లు, సానుభూతివరుల నెట్‌వర్క్‌ను ధ్వంసం చేసే పనిలో ఉన్నాయి.

### మరోదాడికి సిద్ధం అవుతున్న పాక్: మనోజ్‌కుమార్

**న్యూఢిల్లీ, అక్టోబరు 15 :** పాకిస్థాన్ మరో దాడికి ప్రయత్నించే అవకాశం ఉందని వెస్టర్న్ ఆర్మీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ కటియార్ హెచ్చరించారు. జమ్ము కశ్మీర్‌లో ఆయన మాట్లాడుతూ, పహల్గామ్ తరహాలో పాకిస్థాన్ మరో దాడికి ప్రయత్నిస్తే భారత్ నుంచి తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా గట్టిగా బదులిచ్చినప్పటికీ పాకిస్థాన్ తన వైఖరిని మార్చుకోవడం లేదని విమర్శించారు. పాకిస్థాన్ ప్రతి కదలికపై దృష్టి సారించామని మనోజ్‌కుమార్ వెల్లడించారు. ఈసారి అలాంటి దుశ్చర్యకు పాల్పడితే మనం ఇచ్చే సమాధానం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. పాకిస్థాన్ దుందుడుకు చర్యలకు పాల్పడితే ఈసారి గట్టి గుణపాఠం చెబుతామని భారత సైన్యం గత నెలలోనే స్పష్టం చేసింది. ఏప్రిల్ 22న జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్‌కు సమీపంలో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం బైసరన్‌లోయలో ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన విషయం తెలిసిందే.

### ఫ్లాట్‌కొనాలని వెళ్లి 31వ అంతస్తు పైనుంచి పడి మృతి



**లక్నో, అక్టోబరు 15 :** ఒక వ్యక్తి ఫ్లాట్ కొనుగోలు చేయాలని భావించి స్నేహితుడితో కలిసి అపార్ట్‌మెంట్ బిల్డింగ్ వద్దకు వెళ్లిన ఒక వ్యక్తి లోపల భవనం చూద్దామని 31వ అంతస్తు వరకూ వెళ్లి అపైనుంచి పడి చనిపోయిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ప్రాపర్టీ డీలర్‌ను కలిసి మాట్లాడిన వెనువెంటనే ఆ బిల్డింగ్ 31వ అంతస్తు నుంచి కిందపడి అతడు మరణించాడు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. 27 ఏళ్ల సత్యం త్రిపాఠి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఇందిరపురంలో నిర్మించిన సాయా గోల్డ్ అవెన్యూ సొసైటీలోని ఒక ఎత్తైన అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుగోలు చేయాలని అతడు భావించాడు. ఆదివారం రాత్రి 8 గంటలకు సత్యం త్రిపాఠి తన స్నేహితుడు కార్తీక్ సింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారితో కలిసి ఫ్లాట్ చూడటానికి ఆ అపార్ట్‌మెంట్ బిల్డింగ్ వద్దకు వెళ్లాడు. ఆ ముగ్గురు సుమారు 50 నిమిషాలు అక్కడ ఉండి మాట్లాడుకున్నారు. ఇంతలో సత్యం త్రిపాఠి ఉన్నట్టుండి బిల్డింగ్ 31వ అంతస్తు నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడ్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు.

## డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకు కలెక్టర్ నివాళులు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** మాజీ రాష్ట్రపతి భారతరత్న డా. ఏపీజే అబ్దుల్ కలాంకు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ఘనంగా నివాళులు అర్పించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అబ్దుల్ కలాం జయంతి బుధవారం జరిగింది. జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలితో కలసి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా కీర్తి గడించిన మహనీయులు ఏపీజే అబ్దుల్ కలాం అన్నారు. దేశంలో అత్యున్నతమైన రాష్ట్రపతి పదవికి వన్నె తీసుకువచ్చారని కొనియాడారు. సామాన్య కుటుంబం నుంచి దేశం గర్వించదగిన శాస్త్రవేత్తగా ఎదిగిన అబ్దుల్ కలాం తన ప్రసంగాలతో యువతలో స్ఫూర్తి నింపారని, ఆయన జయంతిని ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకోవడం మనందరికీ గర్వకారణం అని చెప్పారు. ఎందరికో ఆదర్శంగా నిలిచిన అబ్దుల్ కలాం సేవలను, ఆశయాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు, సెక్షన్ సూపరింటెండెంట్‌లు మల్లేశ్వరి, కళ్యాణి, కలెక్టరేట్ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

## భారతమాజీ రాష్ట్రపతి అబ్ధుల్ కలాం భవిష్యత్ చైతన్యానికి స్ఫూర్తి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** మిసైల్ మాన్ ఆఫ్ ఇండియా గా పిలువబడిన ఏకైక వ్యక్తి, డా. ఏపీజే అబ్దుల్ కలాం అని, ఆయన జీవనశైలి నేటితరం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, పట్టణ టిడిపి అధ్యక్షులు మహమ్మద్, ఖుద్దూస్ కలాం సేవలను కొనియాడుతూ నివాళులు అర్పించారు.

మాజీరాష్ట్రపతి, భారతరత్న డా. ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని, పురస్కరించుకుని, బుధవారం రామలింగేశ్వరపేట లోని టీడీపీ కార్యాలయంలో, ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, పార్టీ నాయకులు, కలాం చిత్ర పటం చెంత పువ్వులుంచి, ఘనంగా నివాళి అర్పించారు.. ఈ సందర్భంగాపట్టణ పార్టీ అధ్యక్షులు ఖుద్దూస్ మాట్లాడుతూ పద్మభూషణ్, పద్మ విభూషణ్, భారత రత్న గా అవార్డులు, లభించడం వెనుక, అబ్దుల్ కలాం తాను ఎంచుకున్న రంగంలో, చేసినకృషి ఎనలేనిదని, ఐక్య రాజ్య సమితి ఆయన జన్మదినాన్ని ప్రపంచ విద్యా దినంగా పేర్కొనడం, హర్షనీయమని అన్నారు. కలాం గొప్ప శాస్త్ర వేత్తగా భారత్, కీర్తిని అగ్ర భాగాన నిలిపారని, కొనియాడుతు ఘనంగా నివాళులు అర్పించారు.

కార్యక్రమంలో జొన్నాదుల మహేష్, మైనారిటీ సెల్ అధ్యక్షులు మొహిద్దీన్, పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ సుభాని, జిలానీ ఖాన్, రబ్బానీ, షంషుద్దీన్, సిల్వర్ జిలానీ, ఇర్ఫాన్, ఫణిదపు దుర్గ, మల్లవరపు విజయ్, వసంతం అశోక వర్ధన, ముళ్ళపూడి వెంకట్, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, దొప్పలపూడి శ్యామ్, పూర్ణ, కుదరవల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సిపిఆర్‌పై అవగాహన



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందికి వివిధ కళాశాలలోని విద్యార్థులకు సిపిఆర్ పై అవగాహన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అనూష చెప్పారు. మంగళగిరి పట్టణంలోని ఇందిరానగర్ యు పి హెచ్ సి సెంటర్ లో ఎయిమ్స్ వైద్య బృందం ఆధ్వర్యంలో సి పి ఆర్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో యూపీహెచ్సీ లోని వైద్య సిబ్బంది ఏఎన్ఎంలు ఆశాలు వీ జె కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు

అనుకోకుండా ప్రమాదవశాత్తు ఎవరైనా రోడ్లపై పడి ఉన్న వారి ప్రాణాలు ఎలా కాపాడాలో, సిపిఆర్ ఎలా చేయాలి ఎన్నిసార్లు చేయాలో శిక్షణ తోపాటు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా డాక్టర్ అనూష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 13వ తేదీ నుండి 17వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు వివిధ కళాశాలలో సిపిఆర్ పై అవగాహన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు ఇందులో భాగంగా ఎయిమ్స్ వైద్య సిబ్బంది మంగళగిరి తాడేపల్లి పరిధిలోని యూపీహెచ్ సెంటర్లోని వైద్య సిబ్బంది తోపాటు విద్యార్థులకు అవగాహన కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు సి ఎఫ్ ఎం డిపార్ట్మెంట్ ఇంచార్జ్ డాక్టర్ సత్యనారాయణ డాక్టర్ రాజు . డాక్టర్ అనంత ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీజే అబ్దుల్ కలాం ఒక స్ఫూర్తి స్వరూపం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భారత రత్న, మాజీ రాష్ట్రపతి, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పట్టాభిపురం మెయిన్ రోడ్‌లో గల ఆయన విగ్రహానికి బుధవారం నాడు ఎమ్మెల్యే గళ్ళా మాధవి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఒక సాధారణ మనిషి కాదు, ఒక స్ఫూర్తి స్వరూపం. ఆయన జీవితం మనందరికీ ఒక పాఠం, ఒక ప్రేరణ. కలలు కనండి, వాటిని సాధించడానికి కృషి చేయండి అన్న ఆయన మాటలు ప్రతి భారతీయుడికి మార్గదర్శకం. ఆయన చూపించిన దారి అనుసరిస్తే, మన దేశం త్వరలోనే అభివృద్ధి శిఖరాలకు చేరుకుంటుందన్నారు. ఆయన తన చివరి శ్వాస వరకు విద్యార్థులతో, యువతతో గడిపారు. జీవితాంతం నిరాడంబరంగా, నిజాయితీగా సేవ చేసిన ఈ మహనీయుడు మన హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారు. ఆయన కల వికసిత్ భారత్, అంటే పూర్తిగా అభివృద్ధి చెందిన భారతదేశం. ఆ కలను సాకారం చేయడం మనందరి బాధ్యతగా భావించాలన్నారు. ప్రతి యువకుడు తన జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను పెట్టుకొని, క్రమశిక్షణతో కృషి చేస్తే, ఆయన కలలు నిజమవుతాయి. మనం అందరం అబ్దుల్ కలాం చూపిన మార్గంలో నడుస్తే, మన దేశం మరింత వెలుగొందుతుంది," అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వర ప్రసాద్, పాకలపాటి శ్రీకాంత్, జెట్టిబాబు, అబ్దుల్ రహీం, మహమ్మద్ రఫీ, షేక్ నజీర్, ఖాదర్ బుడే, బుడే, రఫీ, నంది సరస్వతీ, డానియల్, విజయ్ కాంత్, షేక్ అన్వర్, శ్రీదేవి, గుర్రం ప్రసాద్, కొల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న బీజేపీ నాయకురాలు మండవ ఆదిలక్ష్మి



**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్):** మాజీ రాష్ట్రపతి భారతరత్న డా. ఏపీజే అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం ను పురస్కరించుకొని కాకుమాను మండల బీజేపీ మహిళా నాయకురాలు మండవ ఆదిలక్ష్మి కార్యక్రమం ను మండల పరిధిలోని కొమ్మూరు గ్రామంలో గల మదర్స నందు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా మదర్సా నందు గల పేద విద్యార్థులకు ఆహారాన్ని అందజేశారు. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మండవ ఆదిలక్ష్మి మాట్లాడుతూ మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా గా కీర్తి గడించిన మహనీయులు అబ్దుల్ కలాం అని కొనియాడారు. ప్రతి ఒక్కరు కూడా విద్యార్థి దశ నుండి అబ్దుల్ కలాం ను ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. బీజేపీ మైనారిటీ మోర్చ రాష్ట్ర నాయకులు డా. షేక్ అబ్దుల్ ఖుద్దుస్ మాట్లాడుతూ దేశంలో అత్యున్నత రాష్ట్రపతి పదవికి అబ్దుల్ కలాం వన్నె తీసుకువచ్చారని కొనియాడారు. సామాన్య పేద కుటుంబంలో లో జన్మించినప్పటికి ఉన్నత లక్ష్యంతో కష్టపడి ఎదిగి దేశం గర్వించదగిన శాస్త్రవేత్త గా ఎదిగిన అబ్దుల్ కలాం తన ప్రసంగాలతో యువత లో స్ఫూర్తి నింపారని అన్నారు. ఎందరికో ఆదర్శంగా నిలిచిన అబ్దుల్ కలాం సేవలను, ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో భాగంగా ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బీజేపీ మహిళా నాయకురాలు మద ర్స నందు పేద విద్యార్థులకు ఆహారం ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు, మద ర్స నిర్వాహకులు మాట్లాడుతూ మదర్స నందు చదువుకుంటున్న విద్యార్థులకు బీజేపీ మహిళా నాయకురాలు మండవ ఆదిలక్ష్మి అందిస్తున్న సహాయం పట్ల ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. నిత్యం ఏదో ఒక రూపంలో చిన్నారులకు నేనున్నానంటూ సహాయ, సహకారాలు అందించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మైనారిటీ మోర్చ రాష్ట్ర నాయకులు డా. షేక్ అబ్దుల్ ఖుద్దుస్, బీజేపీ జిల్లా నాయకులు సాంబశివరావు, రాం గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం-మండల విద్యాశాఖ అధికారి పుల్లయ్య



**బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్):** ఆరోగ్యమే మహాభాగ్యం అని మండల విద్యాశాఖ అధికారి పుల్లయ్య పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ చేతుల పరిశుభ్రతా దినోత్సవం(గ్లోబల్ హ్యాండ్ వాష్ డే) సందర్భంగా మండల కేంద్రంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థి, విద్యార్థినులకు చేతుల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. పై కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ పుల్లయ్య మాట్లాడుతూ ప్రతి రోజూ చేతులను శుభ్రంగా కడుక్కోవడం వల్ల వ్యాధి కారక క్రిములు తొలగిపోయి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండొచ్చు అని, తినడానికి ముందు, బాత్‌రూమ్‌కు వెళ్లి వచ్చిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవడం ఎంతో మంచిదని విద్యార్థులకు సూచించారు. అందులో భాగంగానే ప్రతి సంవత్సరం అక్టోబర్ 15 న అంతర్జాతీయ చేతుల పరిశుభ్రతా దినోత్సవం (గ్లోబల్ హ్యాండ్ వాష్ డే)గా పాటిస్తున్నారన్నారు. చేతులు పరిశుభ్రత లేకపోవడంవల్ల ప్రతీ సంవత్సరం అతిసార, శ్వాస కోస సంబంధింత వ్యాధులతో పిల్లలు అధిక సంఖ్యలో మర ణిస్తున్న నేపథ్యంలో 2008లో ఐక్యరాజ్య సమితి అక్టోబర్ 15న వరల్డ్ హ్యాండ్ వాష్‌డేగా ప్రకటించిందన్నారు. అరచేతులు శుభ్రంగానే ఉన్నట్లు కనిపించినా కోట్లానుకోట్ల సూక్ష్మజీవులు ఉన్నాయనే విషయాన్ని ఊహించలేమన్నారు. నీళ్లతో చేతులు కడుక్కున్నా అవి పోవని సబ్బుతో కానీ, హ్యాండ్ వాష్ ద్రావకంతో కానీ చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. ప్రతిరోజూ భోజనం చేయడానికి ముందు, మల విసర్జనకు వెళ్లొచ్చిన తర్వాత ఇలా చేతుల్ని శుభ్రపర్చుకోవడం వల్ల ఎన్నో ఆరోగ్యాల బారి నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ స్వామి రెడ్డి, ఎంఆర్కె మూర్తి, ఉపాధ్యాయులు తుపాకుల శ్రీనివాసులు, గురవయ్య, అన్నపూర్ణ, శివ ప్రసాద్ రెడ్డి, విజయలక్ష్మి, ఓబులేసు, పీఈటి పుష్పలత తో సహా ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్సులు లేని టపాసుల వ్యాపారం చట్టరీత్యా నేరం

○ **తహసిల్దార్ కె వి గోపాలకృష్ణ**



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** దీపావళి పండుగకు క్రాకర్స్ వ్యాపారాలు నిర్వహించదలచిన వారు విధిగా లైసెన్స్ తీసుకుని, ఉన్నతాధికారులు నిర్ణయించిన ప్రదేశంలోనే క్రాకర్స్ వ్యాపారాలు చేసుకోవాలని, తోపుడుబండ్లపైన అనుమతులు లేని క్రాకర్స్ వ్యాపారాలు చేయరాదని సూచించారు. బుధవారం వి ఎస్ ఆర్ కళాశాల ప్రాంగణంలో క్రాకర్స్ స్టాల్స్ ఏర్పాటుకు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీరామ అప్పలనాయుడు మాట్లాడుతు, కళాశాల క్రీడా మైదానంలో, మొత్తం 50, స్టాల్స్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తహసిల్దార్ కె వి గోపాలకృష్ణ మాట్లాడుతూ గత సంవత్సరం మాదిరిగానే కళాశాల క్రీడా మైదానంలో, తాత్కాలిక లైసెన్సుల ద్వారా క్రాకర్స్ వ్యాపారాలకు అనువుగా, సదుపాయాలు కల్పిస్తామన్నారు. నిర్దేశించిన స్టాల్స్ మినహా, తోపుడుబండ్ల పైన ఎవరు కూడా క్రాకర్స్ వ్యాపారాలు చేయరాదని, ఇందుకు భిన్నంగా వ్యాపారాలు చేసే వారిపై పోలీస్ కేసులు నమోదు చేస్తామన్నారు. లైసెన్సులు ప్రక్రియ పూర్తి కాగానే, లాటరీ పద్ధతిలో స్టాల్స్ అప్పగించడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో టూ టౌన్ పోలీస్ సిబ్బంది. మున్సిపల్ సిబ్బంది ఉన్నారు. ఇదే అంశంపై సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయిలో, క్రాకర్ స్టాల్స్ ఏర్పాటు అంశంపై, ఇన్చార్జ్ సబ్ కలెక్టర్ లక్ష్మీ కుమారి సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. తాత్కాలిక లైసెన్సులు పొందాలనుకున్నవారు, వారి మండలాలకు చెందిన, తహసిల్దార్ ను సంప్రదించాలని సూచించారు.

## నేరాలు... ఘోరాలు నియంత్రించే విషయంలో... కఠిన చర్యలుంటాయి

○ **రౌడి షీటర్స్ పద్ధతులు మారాలి : జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్**



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** రౌడీ షీట్ ఉండి పదేపదే నేర ప్రవృత్తితో సమాజానికి ఇబ్బంది కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, అటువంటి వారి చర్యలను ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెనాలి పట్టణంలోని పోలీస్ స్టేషన్లను సందర్శించిన సందర్భంగా పేర్కొన్నారు. నేరాలు ఘోరాలు నియంత్రించడంలో శాంతిభద్రతలు పరిరక్షించడంలో పోలీస్ శాఖ ద్వారా సమాజానికి అందించే సేవలు వెలకట్టలేనివి. తరచూ ఏవో సమస్యలతో శాంతిభద్రతలు అటకెక్కే పరిస్థితి ఏర్పడినప్పుడు, ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి, ప్రజల్లో శాంతి భద్రతల పట్ల నమ్మకం ఏర్పడే విధంగా చర్యలు చేపడుతూ ఉంటారు. ఈ క్రమంలో తెనాలి పట్టణంలోని, రూరల్ పోలీస్ స్టేషన్ తో సహా, అన్ని పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. అయా స్టేషన్లో క్రైమ్ రేట్ వివరాలు తెలుసుకున్నారు. ఇటీవల కాలంలో తెనాలిలో తరచు గంజాయి కేసులు, దసరా పండుగ రోజు వరుస చోరీలు, పట్టణంలో ఏడు నెలల కాలంలో ఏడు హత్య ఉదంతాలు చోటు చేసుకున్న క్రమంలో శాంతిభద్రతల పరిరక్షణ అందరి బాధ్యత అన్న విధానంతో, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పట్టణంలోని పోలీస్ స్టేషన్లను, కూలంకషంగా పరిశీలించారు. అనంతరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో మీడియాతో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లలో మ్యాన్ పవర్ సమస్య ఉందని అది అధిగమించేందుకు కొత్త రిక్రూట్మెంట్ జరుగుతుందని తద్వారా సమస్యకు పరిష్కారం లభించగలదన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల వల్ల ఎటువంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే 193 కి, సమాచారం ఇవ్వాలన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవారిని ఉపేక్షించబోమన్నారు. స్త్రీ శక్తి టీముల నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దొంగతనాల నియంత్రణలో తగువిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట డిఎస్పీ బి జనార్ధన్ రావు, వన్ టౌన్ సి ఐ, మల్లికార్జునరావు, రూరల్ సీఐ ఉమేష్ చంద్ర, ఎస్సైలు సిబ్బంది ఉన్నారు.

## అబ్దుల్ కలాం స్ఫూర్తిప్రదాత



○ **మిస్సైల్ మ్యాన్ కు నివాళులర్పించిన ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** కల అంటే నిద్ర వచ్చేది కాదని, నిద్ర లేకుండా చేసేదని యువతకు లక్ష్యాలను నిర్దేశించిన మిస్సైల్ మ్యాన్ అబ్దుల్ కలాం ఆదర్శప్రాయులని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఆశయ సాధన దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. 1960లో డీఆర్డీవోలో శాస్త్రవేత్తగా చేరి దేశానికి ఎనలేని సేవలందించారని గుర్తు చేశారు. ఇస్రోలో %యాం%-3 అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. భారత్ మొదటి స్వదేశీ ఉపగ్రహం రోహిణి విజయవంతం చేయడంతోపాటు అగ్ని, ప్రథ్వీ, ఆకాశ్, త్రిశూల్, నాగ్ వంటి క్షిపణుల తయారీలోనూ అబ్దుల్ కలాం కీలకమని చెప్పారు. అందుకే అబ్దుల్ కలాంను మిస్సైల్ మ్యాన్ అని పిలుస్తారని వివరించారు. నేటి యువతకు అబ్దుల్ కలాం జీవితం ఒక పుస్తమని, ఇది జీవితాలను ఉన్నత మార్గంలో తీర్చిదిద్దే ఆయుధమని స్పష్టం చేశారు. రాష్ట్రపతిగా దేశానికి మహెూన్నతమైన సేవలందించారన్నారు. తనకు ఇష్టమైన బోధన చేస్తూ తుది శ్వాస విడిచారన్నారు. పఠాన్ జమీర్, అన్వార్, హుస్సేన్, బాజీ మాస్టర్, ఫిరోజ్, అబ్దుల్ సలీం, కార్పొరేటర్ షేక్ మీరావాలి, డివిజన్ ప్రెసిడెంట్ రియాజ్, మహమ్మద్ హఫీజ్, ఎక్స్ డిప్యూటీ మేయర్ గౌస్, కార్పొరేటర్ ఎలావుల అశోక్, జాగర్లమూడి శ్రీనివాస్, వెల్చూరి కిరణ్, మహంకాళి నరసింహారావు, కోట పిచ్చిరెడ్డి, షేక్ రబ్బాని, చల్లా ఆంజనేయ ప్రసాద్, పోతురాజు చంద్ర రియాసత్, నజీర్, ఇర్రి సాయి, ముకుందరావు, వజ్జా లక్ష్మి, అఖని, హన్ను తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లో పరిసరాల్లో మొక్కలు నాటాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అన్న క్యాంటీన్ల పరిసరాల్లో ఆహ్లాదాన్ని అందించేలా మొక్కలు నాటాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అక్షయ పాత్ర సిబ్బందిని ఆదేశించారు. బుధవారం పల్నాడు బస్టాండ్ లోని అన్న క్యాంటీన్ ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అన్న క్యాంటీన్లలో పచ్చదనం ఉండేలా మొక్కలను జిఎంసి నుండి అందిస్తున్నామని, వాటిని అక్షయ పాత్ర సిబ్బంది నాటి పర్యవేక్షణ చేయాలన్నారు. క్యాంటీన్ పరిసరాల పరిశుభ్రంకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నోడల్ అధికారులు తమకు కేటాయించిన క్యాంటీన్లల్లో మౌలిక వసతులు, ఆహార సరఫరాలను ప్రతి రోజు పరిశీలించాలన్నారు. ప్రధానంగా త్రాగునీరు, పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్యాంటీన్లకు వచ్చే ప్రతి ఒక్కరికీ ఆహారం అందేలా ఇండెంట్ ఉండాలన్నారు.

## పక్షవాతం తర్వాత జీవితాన్ని తిరిగి పొందటం ఎలా ?

○ **నేడు లలితా హాస్పిటల్ లో ఉచిత అవగాహనా సదస్సు**

○ **పక్షవాత పేషెంట్లకు మంచి అవకాశం**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరులో నేడు లలితా హాస్పిటల్ లో పక్షవాతం తరువాత జీవితాన్ని తిరిగి ఎలా పొందవచ్చు అనే విషయంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు బుధవారం స్థానిక వైద్యులు వెల్లడించారు.

గురువారం ఉదయం 10:00 – 12:00 మధ్య కొత్తపేట గణేష్ మహల్ ప్రక్కన ఉన్న. లలితా హాస్పిటల్ పి వి ఎస్ ప్రాంగణంలో డాక్టర్ విజయ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు.

లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, కొత్తపేటలో అక్టోబర్ నెలను పక్షవాతం అవగాహన మాసంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా , ప్రత్యేక "స్ట్రోక్స్ సర్వైవర్స్, కేర్ గివర్స్ మీట్" అనే కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో న్యూరాలజీ ఫాకల్టీ ప్రముఖ ఐ ఎస్ ఏ న్యూరాలజిస్ట్ ప్రసిడెంట్ డాక్టర్ పి. విజయ తో పాటుగా డాక్టర్ యు. వీరమ్మ, డాక్టర్ రేష్మ ,డాక్టర్ ఉషాకిరణ్ బెహరా, డాక్టర్ భార్గవి దేవి ,డాక్టర్ అజ్మానాజ్ , న్యూరో సర్జన్స్ డాక్టర్ ఎన్. శ్రీనివస రావు , డాక్టర్ సృజన, సైకలజిస్టులు డాక్టర్ అజయ్, డాక్టర్ సరోజ , జనరల్ మెడిసిన్ డాక్టర్లు, లైఫ్ స్టయిల్ కౌన్సిలర్, ఫిజియోథెరపిడాక్టర్లు, డైటిషియన్ల నిపుణుల బృందం పాల్గొని సందేహాలను నివృత్తి చేస్తారు. పక్షవాతం నుంచి కోలుకుంటున్నవారు (స్ట్రోక్ హీరోలు), వారి కుటుంబ సభ్యులు పాల్గొని రికవరీ ప్రయాణం వివరించి ఇతరులకు ప్రేరణగా మారతారు.

**ప్రత్యేక ఉద్దేశ్యం:** పేషంట్లు మరియు వారి కుటుంబాలు రికవరీ మార్గాలు, రోజువారీ జీవనశైలిలో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలుసుకోవడం. సామాజిక, ఉద్యోగ, సెక్సువల్, మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తారు. స్ట్రోక్ సర్వైవర్స్ రోల్ మోడల్ గా మారి, ఇతరులకు ప్రేరణ కల్పించడం తమ ఉద్దేశమని చెప్పారు. పక్షవాతం నుంచి కోలుకున్న వారి కథనాలు అనుభవాలు, నిపుణులచే పక్షవాతం, బ్రెయిన్ హెల్త్ పై అవగాహన కల్పిస్తారు.

సందేహాల నివృత్తి ,ఉచిత ఫిజియోథెరపీ, డైట్ కౌన్సిలింగ్

పక్షవాతం పెషంట్లు , వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని వినియోగించు కోవాలని విజ్ఞప్తి చేశారు.. మరిన్ని వివరాలకు ఈ దిగువ తెలిపిన 94907 59378 ఫోన్ నెంబర్లు సంప్రదించవచ్చని చెప్పారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఉదయపూర్ పర్యాటక ప్రాంతాలను సందర్శించిన మంత్రి కందుల దుర్గేష్



- కృత్రిమ మంచినీటి సరస్సు లేక్ పిచోలా, ఉదయపూర్ మాన్సూన్ ప్యాలెస్ సందర్శన
- ఆయా పర్యాటక ప్రాంతాల విశిష్టతను మంత్రి దుర్గేష్ కి తెలిపిన స్థానిక అధికారులు, గైడ్స్
- సరస్సుల నగరం ఉదయపూర్ అద్భుతంగా ఉందని ప్రశంసించిన మంత్రి దుర్గేష్..
- ఇక్కడ పర్యాటక ప్రాంతాల్లో అవలంబిస్తున్న విధానాలు ఏపీలో అమలు చేస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేసిన మంత్రి దుర్గేష్

**ఉదయ్ పూర్ :** అక్టోబర్ 14,15 తేదీల్లో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన జరిగిన కాన్ఫరెన్స్ కు హాజరై, సమావేశం ముగిసిన అనంతరం ఉదయపూర్ లోని ప్రఖ్యాత పర్యాటక ప్రాంతాలను మంత్రి కందుల దుర్గేష్ సందర్శించారు. ఈ సందర్భంగా బోట్ లో వెళ్లి కృత్రిమ మంచినీటి సరస్సు లేక్ పిచోలా ను సందర్శించారు. అక్కడే ఉన్న జగ్ నివాస్, జగ్ మందిర్ లను దర్శించారు. అక్కడి కోట చారిత్రక వైభవాన్ని స్థానిక గైడ్స్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఉదయపూర్ మాన్సూన్ ప్యాలెస్ ను సందర్శించి కలియ తిరిగారు. అక్కడ చారిత్రక విశేషాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ భారతదేశంలోని అత్యంత అందమైన నగరాల్లో సరస్సుల నగరంగా పేరుగాంచిన ఉదయపూర్ ఒకటని కొనియాడారు. పెద్ద రాజభవనాలు, ప్రశాంతమైన సరస్సులు, చారిత్రక కోటలు ఇక్కడి వైభవాన్ని ప్రతిబింబిస్తున్నాయన్నారు. ఈ పర్యాటక పర్యటన అనంతరం ఆంధ్ర ప్రదేశ్ లోని పర్యాటక ప్రాంతాల్లో ఇక్కడ అవలంబిస్తున్న విధానాలు అమలు చేస్తే బాగుంటుందనిపించింది అన్నారు.

## పొగాకు కంపెనీల ఆఫర్లకు దూరంగా ఉండాలి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** పొగాకు ఉత్పత్తిదారులు, కంపెనీల చిహ్నాలు, ప్రచారం ప్రభుత్వ శాఖల్లో లేకుండా చూడాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కోరింది. సదరు సంస్థ భాగస్వామ్యంతో క్రీడలు కానీ, సాంస్కృతిక, ఇతర ఎటువంటి కార్యకలాపాలను నిర్వహించొద్దని స్పష్టంచేసింది. పొగాకు వాడకం తగ్గింపు చర్యల్లో భాగంగా పొగాకు ఉత్పత్తిదారులు, కంపెనీలతో స్పాన్సర్ షిప్, ఒప్పందాలు చేసుకోకూడదని, ఇతర నియంత్రణ చర్యలు పాటించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేకంగా మార్గదర్శకాలు జారీచేసింది. వీటిపై ప్రభుత్వ శాఖల అధికారులకు అవగాహన కల్పించే నిమిత్తం విజయవాడలో బుధవారం ప్రత్యేక కార్యశాలను(వర్క్ షాప్‌ను) వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించింది.

విజయవాడలోని బెంజిసర్కిల్లోని ఓ హొటలులో జరిగిన ఈ కార్యశాలకు పోలీసు, పంచాయతీ రాజ్, పర్యాటక, మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ, పాఠశాల, ఇంటర్, కళాశాల, సాంకేతిక విద్య శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ ఓ) రూపొందించిన ఎఫ్ సీటీసీ (ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ అన్ టూబాకో కంట్రోల్) ఆర్టికల్ 5.3 అమలు గురించి ఈ కార్యశాలలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్న వైటల్ స్ట్రాటజీస్ సంస్థ ముఖ్య ప్రతినిధులు డాక్టర్ అమిత్ యాదవ్, డాక్టర్ శివంకపూర్ మాట్లాడుతూ" ప్రజారోగ్యంపై పొగాకు పరిశ్రమల ప్రభావం ప్రపంచ స్థాయిలో భారత్ 43వ స్థానంలో ఉంది. పొగాకు వాడకంవల్ల 1.3 మిలియన్ల ప్రజలు మరణిస్తున్నారు.

పొగాకు వాడకంతో ఓరల్ క్యాన్సర్, ఊపిరితిత్తులు, ఇతర అనారోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయి. దేశ జనాభాలో 28% మంది పొగాకును ఏదోరకంగా వాడుతున్నారు.

ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న పొగాకు నియంత్రణ చర్యల్లో భాగంగా సదరు కంపెనీల ప్రచారాన్ని నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల చర్యలు తీసుకుంటుంది. డబ్ల్యూహెచ్ రూపొందించిన ఆర్టికల్-5.3 అమలు దేశంలోని 25 రాష్ట్రాల్లో అమలవుతుంది. ఇదేవిధంగా ఆంధ్రప్రదేశ్ లోని ప్రభుత్వ శాఖలు కూడా చర్యలు తీసుకోవాలి' అని వివరించారు.

వర్చువల్ లో డబ్ల్యూహెచ్ ఓ ప్రతినిధి ప్రవీణ్ సిన్హా కూడా కార్యశాలను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ టుబాకో కంట్రోల్ ప్రోగ్రాం రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ ఈవూరు ప్రశాంత్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## స్వదేశీ యాప్‌లను ప్రోత్సహించాలి




- ప్రభుత్వ కార్యాలయాల్లో వాట్సాప్ కు బదులు అరట్టాయ్ యాప్ ను వాడాలి

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన యాప్ లను వినియోగిస్తూ దేశంలో సాంకేతిక నిపుణులు,సంస్థలను ప్రోత్సహించాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. విజయవాడలో సురేష్ బాబు మాట్లాడుతూ వాట్సాప్ కు దీటుగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన అ-రట్టాయ్ సమాచార యాప్ ను ప్రతి ఒక్కరూ వినియోగించేలా డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు. ఆత్మ నిర్భర్ భారతం సాధించాలంటే దేశంలో వివిధ రంగాలలో ప్రతిభావంతులను ప్రోత్సహించాలన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార బదిలీ కొరకు వాడుతున్న వాట్సాప్, టెలిగ్రామ్ లకు బదులుగా అరట్టాయ్ యాప్ ను వినియోగించేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘ సభ్యుల సమాచార బదిలీ కొరకు పలువురు ఉద్యోగులతో ఇప్పటికే అరట్టాయ్ గ్రూపు ను డౌన్లోడ్ చేసి వాడుతున్నట్లు తెలిపారు.

స్వదేశీ మేధావులను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తులో గూగుల్, ఫేస్ బుక్,యూట్యూబ్,ట్విట్టర్ లాంటి యాప్ లను దేశంలో సైతం రూపొందించవచ్చ న్నారు. ఆ సత్తా భారతీయులకు ఉందని సురేష్ బాబు స్పష్టం చేశారు.

## జోరుగా కర్నూలులో ప్రధాని పర్యటన ఏర్పాట్లు

- సహచర మంత్రులతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమీక్షా సమావేశం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారు కర్నూలు పర్యటన సందర్భంగా జరుగుతున్న "సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్" భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, గుమ్మడి సంధ్యారాణి, అలాగే కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ ప్రధాని పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు అత్యంత శ్రద్ధగా, సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు, కార్యకర్తలు ఒకే బృందంలా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ నియంత్రణ నుండి సభా ప్రాంగణం వరకు అన్ని అంశాలను సమగ్రంగా పర్యవేక్షించాలన్నారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ సభ దేశ ఆర్థికాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను ప్రజల ముందుంచే వేదిక. ప్రధానమంత్రి గారు ప్రజలతో నేరుగా మమేకమవుతారు. అందువల్ల ఈ సభను చారిత్రాత్మకంగా మార్చాలన్నారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ప్రజల్లోకి వెళ్లి సభ విజయవంతం కావడంలో పాత్ర వహించాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి మండలంలో ప్రజల్లో ఉత్సాహం నింపి, ప్రధానమంత్రిని అద్భుత స్వాగతం పలుకుదాం. ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్ల ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే సభగా నిలవాలని అన్నారు.

తదుపరి, సభా ప్రాంగణం, వేదిక, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్, నీటి సదుపాయం, మీడియా సౌకర్యాలు, వాలంటీర్ వ్యవస్థ వంటి అంశాలపై విస్తృతంగా సమీక్షించారు. సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ప్రధాని పర్యటన రాష్ట్రానికి మరో కొత్త అవకాశాల ద్వారాలు తెరుస్తుంది. ఈ కార్యక్రమం కేవలం ఒక సభ కాదు, ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి యాత్రకు నూతన దిశా నిర్దేశం చేసే ఘట్టం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సభ విజయవంతం కోసం అందరూ ఒకే తాటిపై నిలిచి, సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## దేశ సేవ కోసం నిలిచే ప్రతి పౌరుడి గుండె చప్పుడు లో మేజర్ భరద్వాజ్ ఉంటారు

- దేశం కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం,సేవలు చిరస్మరణీయం
- దేశ సేవలో ప్రాణం అర్పించిన మేజర్ భరద్వాజ్ కు నివాళు లర్పించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- మేజర్ భరద్వాజ్ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** దేశసేవకోసం నిలిచే ప్రతి పౌరుడి గుండె చప్పుడు లో మేజర్ భరద్వాజ్ ఉంటారని, దేశం కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం, సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జైసల్మీర్ జిల్లాలో ఆదివారం సైనిక విన్యాసాలు చేస్తూ వీరమరణం పొందిన లిఆర్మీ అధికారి మేజర్ టీసీ భరద్వాజ్‌లి అంతిమ యాత్ర శ్రీనివాసరావు పేట మహా ప్రస్థానం వరకు జరిగింది. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గల్లా మాధవి పాల్గొని మేజర్ కి నివాళులర్పించారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఈ సందర్భంగా మాట్లాడుతూ. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన మేజర్ భరద్వాజ్ త్యాగం ఎప్పటికీ మరవలేనిది. ఇలాంటి వీర సైనికుల వల్లే మన దేశం సురక్షితంగా ఉందన్నారు. సైన్యంలో సేవ చేయడం అనేది అత్యున్నత త్యాగం. దేశం కోసం ప్రాణం అర్పించడం అంటే మనం ఊహించలేని ధైర్యం, నిబద్ధత. మేజర్ భరద్వాజ్ గారి సేవలు దేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలుస్తాయి. ఎమ్మెల్యే గళ్ళా మాధవి భరద్వాజ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ఎప్పుడు అవసరమైన తన సహాయ, సహకారాలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు.

## గూగుల్ ఒప్పందంపై టెక్కలిలో సంబరాలు



**టెక్కలి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్‌తో చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో టెక్కలిలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకోవడంతో, విశాఖపట్నంలో అమెరికా తర్వాత అతిపెద్ద ఏఐ హబ్ ఏర్పాటు కానుందని గూగుల్ ప్రకటించింది.

ఈ సంతోషకర సందర్భంగా టెక్కలి మండలం టిడిపి నాయకులు ముందుగానే దీపావళి సంబరాలు జరుపుకున్నారు. టెక్కలి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కోటబొమ్మాళి ఎ.ఎం.సి. (కార్షక మార్కెటింగ్ కమిటీ) చైర్మన్ బగాది శేషగిరి రావు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు పటాకులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు.

నేతలు మాట్లాడుతూ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, టెక్కలి ఎమ్మెల్యే మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తరఫున, అలాగే ఉత్తరాంధ్ర ప్రజల తరఫున చంద్రబాబు, లోకేష్‌లకు అభినందనలు తెలిపారు.

విశాఖను రాష్ట్ర సాంకేతిక రాజధానిగా అభివృద్ధి చేసేందుకు ఈ ఒప్పందం కీలక ఘట్టమని, గూగుల్ పెట్టుబడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని టిడిపి నాయకులు పేర్కొన్నారు.

కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, కోళ్ల లవకుమార్, మెండ దమయంతి, దల్లి ప్రసాద్ రెడ్డి, రెయ్యి ప్రీతిష్ చంద్ర, పరపటి చిన్నయ్య రెడ్డి, ప్రఫుల్ల పరిడ, కెల్లి శ్రీరాములు, గండి సూర్యనారాయణ, కోరాడ రాంప్రసాద్, చల్ల అప్పన్న, గుజ్జురు సత్యనారాయణ, దారపు రాము, మక్కా శంకర్ రెడ్డి, పంగ మన్మద రావు, సీపాన వెంకటరావు, పోలాకి ఆనంద్, వాకాడ రామారావు, యాళ్ల మల్లేష్, బొడ్డేపల్లి లచ్చు, పొట్నూరు చిరంజీవి, సంపతీరావు భాస్కర్, బొల్ల యోగి, కరుకోల లక్ష్మణ్, బొడ్డు మహేష్, కొనారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు విగ్రహ నమూనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని అమరావతిలో 58 అడుగుల ఎత్తులో నిర్మించనున్న అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహ నమూనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. బుధవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన ఈ నమూనాలను సీఎం పరిశీలించారు. రాజధాని ప్రాంతంలోని శాఖమూరులో 6.8 ఎకరాల్లో ప్రభుత్వం పొట్టిశ్రీరాములు స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ స్మృతి వనానికి గత నెల 3వ తేదీన మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. వచ్చే ఏడాది మార్చి 16న పొట్టి శ్రీరాములు 125వ జయంతి నాటికి ఈ స్మృతివనంలో 58 అడుగుల విగ్రహాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో విగ్రహ డిజైన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా విగ్రహానికి స్టాచ్యూ ఆఫ్ సాక్రిఫైస్ గా నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కోచ్ లో మగాళ్ళను ఎలా అనుమతిస్తారు..?



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రైళ్ళల్లో మహిళలకు కేటాయించిన కోచ్ లలో మగాళ్ళను ఎలా అనుతిస్తారని ఏపీ మహిళా కమిషన్ డాక్టర్ రాయపాటి శైలజ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సంత్రగాచి స్పెషల్ రైలులో ప్రయాణిస్తున్న మహిళా ప్యాసింజర్ పై గుంటూరు, పెదకూరపాడు రైల్వే స్టేషన్ల మధ్య జరిగిన అత్యాచార ఘటనపై బుధవారం ఆమె స్పందించారు. ఘటన చాలా బాధాకరమన్నారు. ఈమేరకు ఘటన పూర్వాపరాలను గుంటూరు ఆర్పీఎఫ్ అధికారులతో మాట్లాడి చర్యలనిమిత్తం మహిళా కమిషన్ అధికారులను ఆమె ఆదేశించారు. దీంతో కార్యాలయ అధికారులు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ తో ఫోన్ లో సంప్రదించగా.. ఓ మహిళ రాజమహేంద్రవరంలో సంత్రగచి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో చెర్లపల్లి దాకా ప్రయాణించడానికి ఎక్కగా.. ట్రైన్ గుంటూరు స్టేషన్లో ఆగిన సమయంలో, 40 సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి మహిళా కోచ్‌లోకి ప్రవేశించాడని.. ఆగంతకుడు మహిళను కత్తితో బెదిరించి అత్యాచారానికి పాల్పడినట్లు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు అందిందన్నారు. బాధితురాలి వద్దనున్న నగదు (రూ. 5600) మరియు మొబైల్ ను దోచుకున్నట్లు .. పెదకూరపాడు స్టేషన్ దగ్గర రైలులోంచి దూకి పరారైనట్లు బాధితురాలు ఫిర్యాదిచ్చినట్లు చెప్పారు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు చేసి, కేసును నడికుడి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడానికి పోలీసు బృందాలు దర్యాప్తు చేపట్టాయని.. బాధితురాలు చెబుతున్న ప్రకారం గుంటూరు, పెదకూరపాడు రైల్వేస్టేషన్ ల మధ్య మొబైల్ ట్రాక్ లోకేషన్లు, సీసీ ఫుటేజీలు, ఇతర సాంకేతికత ద్వారా నిందితుడ్ని పట్టుకునేందుకు చర్యలు చేపట్టామని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు చెప్పారు.

**డీఆర్ఎం, ఆర్పీఎఫ్ ఎస్పీలకు లేఖలు:** తక్షణమే ఈ కేసుపై వేగవంతమైన దర్యాప్తును ప్రారంభించి నేరస్తుడిని అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులను కోరారు. ఈమేరకు గుంటూరు రైల్వేస్టేషన్ డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం)కు, విజయవాడ రైల్వే సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఎస్పీ), డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే సెక్యూరిటీ ఫోర్స్, గుంటూరు వారికి మహిళా కమిషన్ ద్వారా బుధవారం లేఖలు పంపారు. మహిళా ప్రయాణికుల భద్రతను నిర్ధారించే చర్యలు వేగవంతం చేయాలన్నారు. మహిళా కంపార్ట్‌మెంట్‌లో మహిళా కానిస్టేబుళ్లను డ్యూటీకి నియమించాలని, మహిళల కోచ్ లలో ప్రయాణించడానికి ప్రయత్నించకుండా పురుషులను నిరోధించడానికి ఆర్పీఎఫ్ క్రమం తప్పకుండా డ్రైవ్‌లను నిర్వహించాలని కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ కోరారు. రైళ్లలో ప్రయాణీకులకు సంబంధించిన భద్రతా లోపాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి చర్యలు చేపట్టాలన్నారు. ఒంటరి మహిళా ప్రయాణీకుల భద్రతపై మరింత నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. సంత్రగాచి స్పెషల్ ఎక్స్‌ప్రెస్ లో జరిగిన ఘటనపై పూర్తి దర్యాప్తు అనంతరం కమిషన్ కు నివేదిక పంపాలని లేఖలో ఆమె కోరారు.

## కదిలే బొమ్మల తయారీ కోసం పరిశోధనలు జరుగుతున్నాయి

- ఏటికొప్పాకపై ప్రత్యేక దృష్టి సాధించిన డిప్యూటీ సీఎం
- ఏటికొప్పాకలో ఎమ్మెల్సీ కె. నాగబాబు పర్యటన



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఏటికొప్పాక బొమ్మలకు సాంకేతికత జత చేసి ప్రపంచ స్థాయికి ఈ కళను చాటి చెప్పే ప్రయత్నం కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతోందని, కదిలే బొమ్మల తయారీ కోసం పరిశోధనలు కూడా జరుగుతున్నాయని శాసన మండలి సభ్యులు కె. నాగబాబు స్పష్టం చేశారు. బుధవారం ఏటికొప్పాకలోని సొసైటీ భవనంలో యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాగబాబు పాల్గొని కళాకారులతో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏటికొప్పాకపై ప్రత్యేక దృష్టి సారించారని, ఎన్నికలకు ముందు వచ్చినప్పుడు ఏదైతే చెప్పామో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అంతకు మించిన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, అంచెలంచెలుగా అనుకున్నవన్నీ నెరవేరుస్తామన్నారు. గతంలో ఇక్కడికి వచ్చినప్పుడు అంకుడు కర్ర కోసం, విద్యుత్ సబ్సిడీ కోసం అడిగినది తమకు గుర్తున్నదని, అంకుడు కర్ర దాదాపుగా అందుబాటులోకి తీసుకు రాగలిగామని, విద్యుత్ సబ్సిడీ గురించి కూడా పరిశీలన జరుగుతోందని చెప్పారు. ఐకమత్యంతో కలిసికట్టుగా ఉంటే, సొసైటీ ద్వారానే ఇవన్నీ చేయడానికి సాధ్యం అవుతుందని వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రతీ కుటుంబానికి రూ. 25 లక్షలు ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయనున్నదని, ఏటికొప్పాక కళాకారులకు ఇది చాలా ఉపశమనం లాంటిదన్నారు. పెన్షన్ పొందడానికి అర్హులైన ప్రతి కళాకారుడికి, పెన్షన్ ఇచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. గతంలో ఉన్న సమస్యల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎలాంటి సమస్యలు పరిష్కారం అయ్యాయని నాగబాబు కళాకారులను అడగగా.. కూటమి ప్రభుత్వం వచ్చాక మాకు అన్ని బాగున్నాయని, మా తరంతోనే ఈ కళ ఆగిపోతుందేమో అని అనుకున్న తరుణంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి అందిస్తున్న సహకారంతో మా కళను భవిష్యత్తు తరాలకు కూడా అందజేయగలమనే నమ్మకం పెరిగిందని కళాకారులు వెల్లడించారు. కూటమి ప్రభుత్వంలోనే భారత మండపంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో ఏటికొప్పాక బొమ్మలు మొట్టమొదటగా ప్రదర్శించే అవకాశం కల్పించారని కళాకారులు సంతోషం వ్యక్తం చేశారు.

**సొసైటీ హాల్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 3 కోట్లు కేటాయింపు**

ఏటికొప్పాక కళాకారుల కోసం సొసైటీ హాల్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 3 కోట్లు కేటాయించిందని, రెండు నెలల్లో ఏటికొప్పాక బొమ్మలాంటి సుందరమైన అధునాతన భవనం నిర్మిస్తామని యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ కుమార్ వెల్లడించారు. కొత్తగా నిర్మాణమవుతున్న భోగాపురం విమానాశ్రయంలో ఏటికొప్పాక బొమ్మలు స్వాగతం పలికే విధంగా ప్రయత్నం చేస్తున్నామని, అటవీ శాఖ ద్వారా కర్రను తయారు చేసుకునే అవకాశం కల్పిస్తామని హామీనిచ్చారు. కళాకారుల సౌలభ్యం కోసం సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఏటికొప్పాక బొమ్మల తయారీ కళను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే విధంగా మార్గదర్శకాలు ఇస్తున్నారని, తదనుగుణంగా ఏటికొప్పాక కళాకారుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని పునరుద్ఘాటించారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467